విశాఖపట్టణం
సోమవారం 27 జులై 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:184 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# బోండాపై బాబు సీరియస్

### అంబటితో వేదికపై ఆగ్రహం

### వివరణ ఇవ్వాలని అధిష్టానం ఆదేశం

**(అమరావతి - జయజయహే)**



రాజకీయల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది.. గుంటూరులో నిర్వహించిన ముద్రగడ పద్మనాభం సంతాప సభలో టీడీపీ నేత, ప్రభుత్వ విప్ బోండా ఉమా, వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు వేదికను పంచుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ సభలో బోండా ఉమా, అంబటి రాంబాబు సరదా సంభాషణలతో కనిపించారు. అయితే.. ఉప్పు-నిప్పులా ఉండే పార్టీల నేతల వీడియోలు నెట్టింట ..మిగతా 2లో

# పరీక్షల సమర్థ నిర్వహణకు టాస్క్‌ఫోర్స్

### నందన్ నీలేకని నేతృత్వంలో ఏర్పాటు

### పారదర్శకత పెంపునకు, లీకేజీలకు అడ్డుకట్ట

### పార్లమెంట్ ముందుకు త్వరలో కఠిన చట్టాలు





**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

విద్యార్థుల భవిష్యత్తు, పేపర్ లీకేజీల వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ కీలక నిర్ణయం తీసుకున్నారు. పోటీ పరీక్షల్లో పారదర్శకత పెంపు, అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ కీలక నిర్ణయం ప్రకటించారు. నందన్ నిలేకని ఆధ్వర్యంలో హైపవర్డ్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పరీక్షల నిర్వహణలో సమూల మార్పులు తీసుకురావడంతో పాటు పేపర్ లీకేజీలను పూర్తిగా అరికట్టేలా సమగ్ర సంస్కరణలు చేపట్టనున్నట్లు ప్రధాని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు భారత ప్రభుత్వం అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన ఎవరూ తప్పించుకోలేరని, ఇప్పటికే తప్పు చేసిన వారు జైళ్లలో మగ్గుతున్నారని ఆయన హెచ్చరించారు.పరీక్షల నిర్వహణలో పారదర్శకతను మరింత పెంచేందుకు, తప్పులకు పాల్పడేవారిపై సత్వర విచారణ జరిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని తెలిపారు. ఈ నేపథ్యంలో క్రిమినల్ కేసుల విచారణ వేగవంతం చేయడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మరింత ..మిగతా 2లో



# కొండకర్ల ఆవకు రక్షణ కవచం

### రక్షిత ప్రాంతంగా గుర్తిస్తూ ఉత్తర్వులు

### జీవ వైవిధ్య పరిరక్షణకు ముందడుగు

### డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవ

**(అమరావతి - జయజయహే)**

దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన మంచినీటి సరస్సు 'కొండకర్ల ఆవ' ఉనికిని కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వన్యప్రాణుల సంరక్షణ చట్టం-1972 కింద దీనిని రక్షిత ప్రాంతంగా గుర్తిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవ తీసుకున్నారు. ఈ జల వనరు ఆధారంగా తరాలుగా జీవనం సాగిస్తున్న మత్స్యకారులు, రైతులకు మేలు చేయడంతో పాటు, జీవవైవిధ్య పరిరక్షణ దిశగా కీలక ముందడుగు వేసినట్లయింది. ప్రభుత్వ నిర్ణయంపై ప్రకృతి ప్రేమికులు, పర్యావరణవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొల్లేరు సరస్సు తర్వాత రాష్ట్రంలోనే అతిపెద్ద మంచినీటి సరస్సుగా కొండకర్ల ఆవ ప్రత్యేక గుర్తింపు కలిగి ఉంది. అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం, మునగపాక మండలాల పరిధిలో, చుట్టూ కొండల మధ్య సుమారు 2,500 ఎకరాల విస్తీర్ణంలో నెలకొని ఉన్న ఈ సరస్సు ప్రకృతి అద్భుతంగా నిలుస్తోంది. ఏటా వర్షాకాలంలో అనకాపల్లి శారదా నది నుంచి వచ్చే వరద నీరే ఈ ఆవకు ప్రధాన వనరు. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు ..మిగతా 2లో



2

# నేటి నుంచి ఇంటింటికీ టీడీపీ

### 45 రోజుల పాటు నిర్వహణ

### రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ వెల్లడి

# ఇక ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయను

### ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉంటా.. నేటి రాజకీయాలు పూర్తిగా అవినీతిమయం

### గెలవాలంటే డబ్బే కీలక పాత్ర.. నిజాయితీకి ఆస్కారం లేదు

### కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య వ్యాఖ్యలు



**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య సంచలన ప్రకటన చేశారు.ఇకపై తాను ఏ ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించారు. నేటి రాజకీయాల్లో వస్తున్న మార్పులు, వయసురీత్యా వస్తున్న అనారోగ్య సమస్యల కారణంగానే తాను ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. 2028లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఎలాంటి పరిస్థితుల్లోనూ పోటీ చేయబోనని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. వరుణా నియోజకవర్గ ప్రజలు తనపై ఒత్తిడి తెస్తున్నప్పటికీ, ..మిగతా 2లో

# పీసీసీ చీఫ్ షర్మిలకు సర్జరీ

### బెడ్ రెస్ట్ తీసుకుంటున్నట్లు పోస్టు

### వేగంగా కోలుకోవాలని నేతలు ఆకాంక్ష

**(హైదరాబాద్ - జయజయహే)**



కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గత కొన్ని రోజులుగా మీడియాలోగానీ, కార్యక్రమాల్లో కనిపించడం లేదు. దాంతో ఆమె ఏమయ్యారు, ఎక్కడున్నారు అని చర్చ జరుగుతున్న సమయంలో కీలక అప్డేట్ వచ్చింది. వైఎష్ షర్మిలకు ఇటీవల సర్జరీ జరిగింది. ప్రస్తుతం ఆమె వేగంగా కోలుకుంటున్నారు. ఇదే విషయాన్ని షర్మిల తన సోషల్ మీడియా అకౌంట్లో పోస్ట్ చేసి వెల్లడించారు. అబ్డామినల్ సర్జరీ చేయించుకున్న తాను రికవరీ అవుతున్నానంటూ బెడ్ మీద ఉన్న ఫొటో షేర్ చేసి హెల్త్ అప్డేట్ ఇచ్చారు. తాను త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన కుటుంబసభ్యులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ..మిగతా 2లో



# బంగాళాఖాతంలో వాయుగుండం

### 24 గంటల్లో మరింత బలపడే ఛాన్స్

### ఉత్తరాంధ్ర తీరంపై ప్రభావం

**(అమరావతి - జయజయహే)**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారినట్లు ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇది రాబోయే 24 గంటల కాలంలో తీవ్ర వాయుగుండంగా రూపాంతరం చెందే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఈ తీవ్ర వాయుగుండం సోమవారం నాటికి ఒడిశాలోని పారాదీప్, పశ్చిమ బెంగాల్‌లోని సాగర్ ద్వీపాల మధ్య తీరాన్ని దాటే సూచనలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. వాయుగుండం తీరం వైపు పయనిస్తున్న కొద్దీ దీని ప్రభావం ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాలపై స్పష్టంగా కనిపించనుంది. ముఖ్యంగా ..మిగతా 2లో

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

### విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత మంత్రులు రాజీనామా చేయాలి

### ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు విడుదల

### వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ డిమాండ్

**(విజయనగరం - జయజయహే)**



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను, విద్యార్థుల భవిష్యత్తును గాలికొదిలేసి ఒంటెద్దు పోకడలు, అవినీతి నిర్ణయాలతో పాలన చేస్తోందనిశాసనమండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయనగరంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య నివాసంలో జరిగిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న తీవ్ర అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని, రూ. 10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల్లో హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతిని ..మిగతా 3లో

## ప్రధాని మోడీ భోగాపురం షెడ్యూల్ ఖరారు




2


# 43 ఏళ్ల తర్వాత విజయనగరానికి ప్రధాని

### 1983లో ఇందిరా గాంధీ పర్యటన

### ఇప్పుడు భోగాపురం ఎయిర్ పోర్టుకు మోడీ

**(విజయనగరం - జయజయహే)**

విజయనగరం జిల్లా చరిత్రలో మరో అరుదైన ఘట్టం ఆవిష్కృతం కానుంది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జిల్లా పర్యటనకు రానుండటంతో అన్ని వర్గాల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఒక ప్రధానమంత్రి అధికారిక హోదాలో విజయనగరం జిల్లాకు రావడం అనేది చాలా అరుదైన సంఘటన.. దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా విరామం తర్వాత మరోసారి ప్రధానమంత్రి జిల్లా గడ్డపై అడుగుపెట్టబోతుండటం చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకుంది. 1983లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జిల్లా పర్యటన ప్రజల్లో విశేష ..మిగతా 2లో



For a pure tomorrow.. జయహే

# పరీక్షల సమర్థ నిర్వహణకు టాస్క్‌ఫోర్స్

మొదటి పేజీ తరువాయి...

కఠినమైన చట్టాన్ని పార్లమెంటు ముందుకు తీసుకురానున్నట్లు మోదీ ప్రకటించారు.

**నందన్ నీలేకని నేతృత్వంలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు**

కేవలం శిక్షలే కాకుండా, రాబోయే తరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షల విధానంలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని మోదీ అభిప్రాయపడ్డారు. మన పరీక్షల విధానం మరింత పారదర్శకంగా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధన కోసమే ప్రపంచ ప్రసిద్ధ సాంకేతిక నిపుణుడు నందన్ నీలేకని నేతృత్వంలో ఒక హైపవర్డ్ టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని వెల్లడించారు. ఈ టాస్క్ ఫోర్స్ అందించే నివేదిక ఆధారంగా పరీక్షల వ్యవస్థ ప్రక్షాళనకు తగిన చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

**నందన్ నిలేకని ఎవరంటే ?**

నందన్ నీలేకని భారత్‌లో అత్యంత ప్రసిద్ధులైన ప్రముఖ సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్త.. ప్రపంచ ప్రఖ్యాత ఐటీ దిగ్గజ సంస్థ అయిన 'ఇన్ఫోసిస్' సహ వ్యవస్థాపకులలో ఆయన ఒకరు. అంతేకాకుండా ఆ సంస్థకు సీఈఓగా, ఛైర్మన్‌గా కూడా సేవలందించారు.. భారతదేశంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఆధార్ ప్రాజెక్టుకు తొలి ఛైర్మన్‌గా వ్యవహరించారు. కేంద్ర కేబినెట్ మంత్రి హోదాలో ఆయన దేశ ప్రజలందరికీ బయోమెట్రిక్ గుర్తింపు సంఖ్య (ఆధార్) అందించడంలో కీలక పాత్ర పోషించారు.



సాంకేతిక, ఆర్థిక రంగాలకు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 2006లో ఆయనను దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్ తో సత్కరించింది. అలాగే టైమ్ మ్యాగజైన్ ప్రపంచంలోని అత్యంత ప్రభావశీల వ్యక్తులలో ఒకరిగా ఆయన్ను పేర్కొంది. దేశంలో డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిలోనూ, విద్యారంగంలో సాంకేతికతను జోడించే కార్యక్రమాలలోనూ ఆయన క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

## ఇక ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయను

మొదటి పేజీ తరువాయి...

ఇకపై ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నికలంటే నియోజకవర్గ ప్రజలే స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చి గెలిపించేవారని, కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నేటి రాజకీయాలు పూర్తిగా అవినీతిమయమయ్యాయని, ఎన్నికల్లో గెలవాలంటే డబ్బు కీలక పాత్ర పోషించే దుస్థితి వచ్చిందని విమర్శించారు. నిజాయితీ రాజకీయాలకు ప్రస్తుత వ్యవస్థలో ఆసరా లేకుండా పోయిందని ఆయన అభిప్రాయపడ్డారు. తనకు ప్రస్తుతం 79 ఏళ్లు అని, ప్రస్తుత ప్రభుత్వ పదవీకాలం ముగిసేనాటికి తన వయసు 81-82 సంవత్సరాలకు చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. వయసురీత్యా ఆరోగ్యం మునుపటిలా బలంగా లేకపోవడంతో, గతంలో ఉన్న ఉత్సాహంతో ఇకపై కష్టపడి పనిచేయడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. 1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించినట్లు సిద్ధరామయ్య గుర్తుచేసుకున్నారు. 2028 నాటికి తన రాజకీయ జీవితంలోకి వచ్చి సరిగ్గా ఐదు దశాబ్దాలు (50 ఏళ్లు) పూర్తవుతాయని తెలిపారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో ఓటములు, విజయాలను చూశానని, అయితే తాను నమ్మిన సిద్ధాంతాలకు, మనస్సాక్షికి వ్యతిరేకంగా ఎప్పుడూ ప్రవర్తించలేదని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనప్పటికీ, రాజకీయాల్లో ఎప్పుడూ క్రియాశీలకంగానే ఉంటానని, ప్రజల కష్టసుఖాలకు నిత్యం గొంతుకగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. గత ఐదు దశాబ్దాలుగా రాష్ట్ర ప్రజలు తనను ఆదరించి నడిపించారని, ఆ రుణం తీర్చుకోలేనిదంటూ తన భవిష్యత్ జీవితాన్ని కూడా పూర్తిగా ప్రజా సేవకే అంకితం చేస్తానని సిద్ధరామయ్య ప్రకటించారు.

## 43 ఏళ్ల తర్వాత విజయనగరానికి ప్రధాని

మొదటి పేజీ తరువాయి...

స్పందన తెచ్చింది. ఆమె పర్యటన అనంతరం మళ్లీ ప్రధానమంత్రి స్థాయిలో ఏ ఒక్కరు కూడా జిల్లా సందర్శన చేయకపోవడంతో, ఈ ప్రాంత ప్రజలు అప్పటి నుంచి అలాంటి సందర్భాన్ని చూడలేదు. ఇప్పుడు నరేంద్ర మోదీ రాకతో ఆ నిరీక్షణకు తెరపడుతోంది. ఈ పర్యటనను కేవలం రాజకీయ కార్యక్రమంగా కాకుండా, ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రయాణంలో కీలక మైలురాయిగా అధికారులు, ప్రజాప్రతినిధులు అభివర్ణిస్తున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ప్రధానమంత్రి పాల్గొనడం వల్ల దేశవ్యాప్తంగా ఉత్తరాంధ్రపై దృష్టి మరింత కేంద్రీకృతమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భోగాపురం విమానాశ్రయం ప్రారంభం తర్వాత విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు కొత్త అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. పర్యాటకం, పారిశ్రామిక రంగం, ఐటీ, లాజిస్టిక్స్, ఎగుమతులు, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి స్వయంగా వచ్చి ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేయడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రధాని పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేపట్టింది. భద్రతా ఏర్పాట్ల నుంచి ట్రాఫిక్ నియంత్రణ వరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. లక్షలాది మంది హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రాజకీయంగా కూడా ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. కేంద్ర ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యతను ఈ పర్యటన ప్రతిబింబిస్తోందని ఎన్డీఏ వర్గాలు చెబుతుండగా, ప్రతిపక్షాలు కూడా ఈ పర్యటన పై ఆసక్తిగా దృష్టి సారించాయి. ప్రజల్లో మాత్రం అభివృద్ధి ప్రాజెక్టులు వేగంగా పూర్తి కావాలని, కొత్త పెట్టుబడులు రావాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 43 ఏళ్ల తర్వాత విజయనగరం జిల్లా మరోసారి ప్రధానమంత్రి పర్యటనకు వేదిక కావడం చరిత్రలో నిలిచిపోయే ఘట్టంగా నిలవనుంది. ఇందిరా గాంధీ తర్వాత నరేంద్ర మోదీ జిల్లా గడ్డపై అడుగుపెడుతున్న ఈ సందర్భం, ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. అయితే నరేంద్ర మోదీ విజయనగరం జిల్లాలో 2014 ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నప్పటికీ అప్పటికి ప్రధాని కాకపోవడంతో ప్రధాని హోదాలో ఇప్పుడు మరోసారి రావడం గమనార్హం..

## బంగాళాఖాతంలో వాయుగుండం

మొదటి పేజీ తరువాయి...

ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 55 నుండి 65 కిలోమీటర్ల వేగంతో, కొన్నిసార్లు అంతకంటే ఎక్కువ వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉంది. సముద్రం తీవ్ర అల్లకల్లోలంగా మారనున్నందున తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వాయుగుండం ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుండి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. మిగిలిన కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు వర్షపాతం నమోదు కావచ్చు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ వాతావరణ మార్పుల ప్రభావం తెలంగాణపై కూడా ఉండనుంది. రాగల రెండు మూడు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు కురవనున్నట్టుగా వెదర్ మ్యాన్ అంచనా వేశారు. వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, కామారెడ్డి, మెదక్ జిల్లాలతోపాటుగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కూడా వర్షాలు పడనున్నాయి. అక్కడక్కడ వానలు పడే అవకాశం ఉ ంది. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉండి, అక్కడక్కడ చినుకులు లేదా మోస్తరు వర్షం పడే సూచనలు ఉన్నాయి. ఉపరితల గాలులు బలంగా వీచే అవకాశం ఉన్నందున విద్యుత్ శాఖ, జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రయాణాలు చేసే వారు, లోతట్టు ప్రాంతాల నివాసితులు వాతావరణ హెచ్చరికలను గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## పీసీసీ చీఫ్ షర్మిలకు సర్జరీ

మొదటి పేజీ తరువాయి...

కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఇటీవల పొత్తికడుపునకు సంబంధించిన శస్త్రచికిత్స (అబ్డామినల్ సర్జరీ) చేయించుకున్నారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం. సర్జరీ ఎక్కడ, ఎప్పుడు జరిగిందనే అంశాలను ఆమె గానీ, పార్టీ నేతలుగానీ వెల్లడించలేదు. సర్జరీ అనంతరం డాక్టర్ల సూచనల మేరకు ఆమె ప్రస్తుతం పూర్తిగా బెడ్ రెస్ట్ తీసుకుంటున్నారు. తన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, తాను కోలుకోవాలని ఆకాంక్షించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. నీట్ పేపర్ లీక్‌కు కేంద్రం బాధ్యత తీసుకోవాలని, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఇటీవల దేశవ్యాప్తంగా నిరసన చేపట్టింది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా పేపర్ లీకేజీల ఆందోళనను కాంగ్రెస్ ముమ్మరం చేసింది. ఈ క్రమంలో గవర్నర్ బంగ్లా ముట్టడి సహా కీలక నిరసన కార్యక్రమాలు చేపట్టినా వైఎస్ షర్మిల ఎక్కడా కనిపించలేదు. దాంతో ఆమె కాంగ్రెస్ అధిష్టానంపై అసంతృప్తిగా ఉన్నారని, అందుకే పార్టీ కార్యక్రమాలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొనలేదని ప్రచారం జరిగింది. పార్టీ ఆఫీస్ మీద దాడి జరిగినా ఆమె విజయవాడ రాకపోవడం పై అందరికీ చాలా అనుమానాలు వచ్చాయి. ఆమెకు కర్ణాటక నుంచి వస్తుందనుకున్న రాజ్యసభ సీటు చివరి నిమిషంలో ఆమెకు నిరాశే ఎదురైంది. అదే కారణంతో పార్టీ నిరసన కార్యక్రమాల్లో, ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో సైతం షర్మిల కనిపించలేదని ప్రచారం జరిగింది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉన్న షర్మిల క్షేత్రస్థాయిలో కనిపించకపోవడం సైతం ఊహాగానాలకు ఊతమిచ్చింది. మరోవైపు ఆమె ఏం చేస్తున్నారు, ఎక్కడున్నారు లాంటి వివరాలు బయటకు రాకపోవడంతో రాజ్యసభ సీటు దక్కని కారణంగానే షర్మిల సైలెంట్ అయ్యారన్న వ్యాఖ్యలకు బలం చేకూరింది. కానీ అస్వస్థత కారణంగా ఆమె పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారని తాజా ప్రకటనతో స్పష్టమైంది. సర్జరీ తరువాత పూర్తిగా కోలుకున్నాక ఏపీ కాంగ్రెస్ కార్యక్రమాలతో పాటు, క్షేత్రస్థాయిలో పోరాటం కొనసాగిస్తారని తెలుస్తోంది.

# నేటి నుంచి ఇంటింటికీ టీడీపీ

**45 రోజుల పాటు నిర్వహణ**

**రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ వెల్లడి**

**(అమరావతి - జయజయహే)**

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతుందని ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ నేపథ్యంలో నేటి నుంచి 'ఇంటింటికి తెలుగుదేశం పార్టీ' కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. మొత్తం 45 రోజుల పాటు ఈ కార్యక్రమం నిరంతరాయంగా జరుగుతుందని చెప్పారు. ఆదివారం మంగళగిరిలోని కార్యాలయంలో పార్టీ కేడర్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమాన్ని క్షేత్రస్థాయిలో ఇంటింటికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తీసుకెళ్లాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సహాయం, మిత్రపక్షాల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త ఉత్సాహంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సూపర్-6 హామీల అమలు, మహిళలు, రైతులు, యువత, విద్యార్థులకు అందిన లబ్ధిని ప్రజలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వ విధ్వంసకర పాలనకు, ఎన్డీయే ప్రభుత్వ అభివృద్ధి పాలనకు మధ్య ఉ న్న తేడాను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. ప్రజల సమస్యలు, సూచనలను నమోదు చేసి.. వాటి పరిష్కారానికి పార్టీ, ప్రభుత్వం తరపున చర్యలు తీసుకునేలా కృషి చేయాలని పార్టీ కేడర్‌కు తెలిపారు.



## ప్రధాని మోడీ భోగాపురం షెడ్యూల్ ఖరారు

**(అమరావతి - జయజయహే)**

ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కానుంది. ఆగస్టు 1వ తేదీన (శనివారం) విమానాశ్రయాన్ని ప్రధాని మోదీ ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో భోగాపురంలో ప్రధాని మోదీ పర్యటన ఖరారైంది. ఉదయం10:45 గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రధాని చేరుకుంటారు.

**షెడ్యూల్ వివరాలివే..**

ఆగస్టు 1వ తేదీన ఉదయం 10:45 -- 10:50 గంటలకు ప్రధాని మోదీ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు నాయుడితోపాటు, రాష్ట్ర మంత్రులు ప్రధానికి స్వాగతం పలుకుతారు.

10:50 -- 10:55: కారులో ప్రయాణికుల టెర్మినల్ భవనానికి ప్రధాని మోదీ చేరుకుంటారు.

10:55 -- 10:58: దాదాపు 200 మంది విద్యార్థులు కూచిపూడి నృత్యంతో ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలకనున్నారు.

11:00 -- 11:15: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులను ప్రధాని మోదీ పరిశీలిస్తారు.

11:17 -- 11:25: టెర్మినల్ భవనం నుంచి ఓపెన్ టాప్ జీప్‌లో బహిరంగ సభా వేదికకు ప్రధాని మోదీ చేరుకుంటారు.

11:30 -- 12:55: విమానాశ్రయం ప్రారంభోత్సవం, శిలాఫలక ఆవిష్కరణ, అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభిస్తారు. ఆ తర్వాత బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తారు.

మధ్యాహ్నం 1:05 -- 1:10: భోగాపురం నుంచి ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీకి ప్రధాని మోదీ తిరుగు ప్రయాణం కానున్నారు.

## బొండాపై బాబు సీరియస్

మొదటి పేజీ తరువాయి...

వైరల్ గా మారాయి. ఈ క్రమంలోనే.. బోండా ఉమ, అంబటి వేదిక పంచుకోవడంపై టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. వైసీపీ నేతలతో ఎట్టిపరిస్థితుల్లో వేదిక పంచుకోవద్దని స్పష్టం చేశారు. పార్టీ నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని ప్రస్తావించారు చంద్రబాబు. గొడ్డలి పార్టీ అనేది విష వృక్షం లాంటిదని.. ఈ విషయాన్ని ప్రతి టీడీపీ నేత గుర్తుంచుకోవాలని సూచించారు. నిత్యం కులాలు, మతాల పేరుతో విద్వేషాలు రగిలించడమే వైసీపీ అజెండా అన్నారు. ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. టీడీపీ నేతలెవరూ వారి పార్టీ ట్రాప్‌లో పడొద్దని సూచించారు. పార్టీ వ్యూహాలు, రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై చర్చించిన చంద్రబాబు.. వైసీపీ నిత్యం కులాలు, మతాల పేరుతో విద్వేషాలు రగిలించడమే ఆ పార్టీ అజెండాగా మారిందని ఆరోపించారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు వారు చేస్తున్న కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. దృష్టి మొత్తం అభివృద్ధి, సంక్షేమంపై ఉండాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే మన ప్రధాన లక్ష్యం అంటూ నేతలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ కార్యక్రమంలోనూ పాల్గొనకుండా, ప్రజలకు మరింత చేరువగా వెళ్లాలని టీడీపీ శ్రేణులకు చంద్రబాబు పిలుపునిచ్చారు. ఇటీవల బొండా ఉమ, అంబటి రాంబాబు ఒకే వేదికను పంచుకోవడంతో పాటు వివిధ సందర్భాల్లో టీడీపీ, వైసీపీ నేతలు ఒకే వేదికపై కనిపించడం గతంలో చర్చ జరిగింది. దీంతో ఈ అంశంపై ఇటు అధికార పార్టీలోనూ చర్చ మొదలైంది. ఇది కేడర్‌కు తప్పుడు సంకేతాలు పంపుతుందన్న భావనలో ఉన్న టీడీపీ నాయకత్వం.. ఇకపై ఇలాంటివి జరగకుండా చూసుకోవాలని స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది.

## కొండకర్ల ఆవకు రక్షణ కవచం

మొదటి పేజీ తరువాయి...

సుమారు 25 గ్రామాల రైతులకు సాగునీటిని అందిస్తోంది. అదేవిధంగా ఈ 2 మండలాల పరిధిలో భూగర్భజలాల పెంపునకు ఈ సరస్సు ఎంతో దోహదపడుతోంది. ఇటీవల 'ఈస్ట్‌కోస్ట్ కన్జర్వేషన్' నిపుణుల బృందం సర్వే నిర్వహించింది. ఇక్కడ అరుదైన నీటికుక్కలతో పాటు అంతరించిపోయే జాతుల జాబితాలో ఉన్న నీటిపిల్లులు, కుందేళ్లు, కొండ చిలువలు, అరుదైన చేపలు ఉంటున్నాయని నిపుణులు నిర్ధారించారు. ఆవ చుట్టూ ప్రత్యేకమైన ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసి మరీ వీటిని గుర్తించారు. ఈ సరస్సు జీవ వైవిధ్య నిధిగా మారింది. కొండకర్ల ఆవను ఇప్పుడు రక్షిత ప్రాంతంగా గుర్తించారు. దీంతో అరుదైన జీవజాలానికి పూర్తి స్థాయి రక్షణ లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రైతుల ప్రయోజనాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సరస్సు, సాగునీటి నిర్వహణ అంతా జలవనరుల శాఖకే అప్పగించింది. అటవీశాఖ చేపట్టే ఏ పనులకైనా ఆ శాఖ అనుమతిని తప్పనిసరి చేసింది. సరస్సు సహజ నిల్వలు, కాలువలు, నీటి ప్రవాహం, వరద నిర్వహణ, ప్రజా భద్రతకు ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వం పేర్కొంది. పూడికతీత, ఆధునికీకరణ, గట్ల అభివృద్ధి, నీటి నిర్వహణ బాధ్యత అంతా జలవనరులశాఖే నిర్వహిస్తోందని తెలిపింది. ఎకో టూరిజం, జెట్టీలు నిర్మాణం, రహదారి ఏర్పాటు ఇలా ఏం చేయాలన్నా అనుమతి తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సరస్సులో దేశ, విదేశాలకు చెందిన 170 రకాలైన పక్షులు కొండకర్ల ఆవలో నివాసం ఏర్పాటు చేసుకుని, సంతాన ఉత్పత్తి చేసుకుంటున్నా ఈ జలవనరు రక్షణకు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పర్యాటక కార్యకలాపాల పేరుతో పర్యావరణానికి హాని కలిగించే చర్యలను అరికట్టేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. ప్రభుత్వం సరస్సుకు రక్షిత హోదా ప్రకటించింది. దీంతో ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలులేదు. ఇకపై వేట, చెట్ల నరికివేత, ఇతర విధ్వంసాలకు అడ్డుకట్ట పడనుంది. రైతులు, మత్స్యకారులకు మేలు: కొండకర్ల ఆవను రక్షిత ప్రాంతంగా గుర్తించడం చాలా ఆనందంగా ఉందని ఆవనీటి సంఘం అధ్యక్షులు కాండ్రేగుల జోగినాయుడు హర్షం వ్యక్తం చేశారు. దీని పరిధిలో రైతులతో పాటు ఈ సరస్సుపై ఆధారపడే మత్స్యకారులకు ఈ నిర్ణయంతో మేలు జరిగినట్లయిందన్నారు. సర్వే నిర్వహించి సరస్సు చుట్టూ హద్దులు నిర్ణయించాలని సూచించారు. ప్రస్తుత ఆక్రమణలు తొలగించడంతో పాటు భవిష్యత్తులో ఆక్రమణలు గురికాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

**మొదటి పేజీ తరువాయి...**

అమలు చేయకపోవడంపై మండిపడ్డారు. భోగాపురం విమానాశ్రయ భూసేకరణతో పాటు అన్ని అనుమతులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే విజయవంతంగా పూర్తయ్యాయని.. ఇందులో కూటమి ప్రభుత్వ గొప్పదనం ఏమీ లేదని తేల్చి చెప్పారు. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ స్థలం కేటాయింపులపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. నిబంధనల మేరకే విజయనగరంలో పార్టీ కార్యాలయానికి భూమి కేటాయించారని స్పష్టం చేశారు. సుమారు 3 లక్షల మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరైన డీఎస్సీ పరీక్షల నిర్వహణలోనూ, ఫలితాల్లో తీవ్ర అవకతవకలు జరిగాయి. ప్రభుత్వంలో పారదర్శకత, నిరుద్యోగుల పట్ల నిజాయితీ ఉంటే డీఎస్సీ అక్రమాలపై తక్షణమే సీబీఐ విచారణకు ఆదేశించాలి. విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత మంత్రులు తమ పదవులకు రాజీనామా చేసి, నిజాయితీ నిరూపించుకున్నాకే మళ్లీ ప్రభుత్వంలోకి రావాలి. డిఎస్సీలో పరీక్షల ముందు ఒక జీఓ, పరీక్షల తర్వాత మరొక జీఓ తెస్తూ తమకు నచ్చిన వారికి అపాయింట్‌మెంట్లు ఇచ్చేలా జీఓ నంబర్ 4, జీఓ నంబర్ 47 లలో సవరణలు చేస్తూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారు. స్పోర్ట్స్ కోటా నిబంధనలను కూడా సవరించి, దారి మళ్లించి తమ వర్గానికి చెందిన వారికి లబ్ధి చేకూర్చేలా అక్రమాలకు పాల్పడ్డారు అని ఆగ్రహం వ్యక్తం చేసారు.

**ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలి**

స్వర్గీయ వైఎస్సార్ ఆలోచన నుంచి వచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన పథకాల కింద ఈ ప్రభుత్వం రూ.10 వేల కోట్లు బకాయిలు పెట్టింది. గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, అలాగే 2014లో వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని ఆపకుండా కొనసాగించాయి. ఇప్పుడు మాత్రం అదే చంద్రబాబు ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు మరియు ప్రభుత్వ కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. సర్టిఫికెట్లు లేక నిరుద్యోగులు ఉద్యోగాలకు ఎలా దరఖాస్తు చేసుకుంటారు?

ప్రభుత్వానికి కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించడానికి డబ్బులున్న ప్రభుత్వానికి... విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించడానికి మాత్రం మనసు రావడం లేదు.

**భోగాపురం విమానాశ్రయం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కృషి ఫలితమే.**

గత టీడీపీ ప్రభుత్వం భోగాపురం ఎయిర్‌పోర్ట్ కోసం 15,000 ఎకరాలు అడిగి రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత తెచ్చుకుంది. మా ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ కేవలం 2,700 ఎకరాల భూమిని పారదర్శకంగా సేకరించి, ఎయిర్‌పోర్ట్‌కు 2,200 ఎకరాలు కేటాయించి పనులు వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి రావడం సంతోషకరం, ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి ఆయన ప్రత్యేక వరాలు ప్రకటించాలి. విమానాశ్రయ ప్రారంభోత్సవం ముగిసిన తర్వాత, ఆగస్టు 1 నాటికి ఈ ప్రభుత్వం చేసిన మోసాలపై బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రజాక్షేత్రంలో నిజాలు వెల్లడిస్తాం అని బొత్స వెల్లడించారు.

**పార్టీ ఆఫీస్ స్థలంపై స్పష్టత**

విజయనగరంలో పూర్వం నుంచి ఉన్న ఆస్తులన్నీ మహారాజు గారి పేరు మీద ఉన్న విషయాన్ని మేమందరం గౌరవించి అంగీకరించాం. రాజభరణాల రద్దు వంటి అంశాలన్నీ అందరికి తెలుసు. అదే విధంగా మాన్సాస్ ట్రస్ట్‌లో అవకతవకలు జరుగుతున్నాయని వారి సోదరుడు ఆనందగజపతిరాజు ఉన్నప్పుడు... దాన్ని ప్రభుత్వంలో కలపాలని గతంలో అశోక్ గజపతిరాజు గారే లేఖ రాసిన మాట వాస్తవం కాదా?. శంకర్ ఫౌండేషన్ సంస్థకు ప్రభుత్వం స్థలం ఇచ్చినట్లే, వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి కూడా నిబంధనల ప్రకారమే ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. ప్రతిదాన్నీ రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడానికి ప్రయత్నించకుండా నాయకులు తమ గౌరవాన్ని కాపాడుకోవాలి. .ఒకరి వైపు వేలు చూపించే ముందు తమ గత చరిత్రను, తమ కింద ఉన్న మచ్చలను తెలుసుకోవాలని గుర్తు చేశారు. అదే విధంగా వ్యవసాయం అంటే చంద్రబాబుకి గిట్టదని.. మరే రాష్ట్రంలోని లేని విధంగా ఏపీలో ఎరువుల కొరత ఎందుకు వచ్చిందిని బొత్స ప్రశ్నించారు



## గడప వద్దకే ఎమ్మెల్యే ఆదిరెడ్డి

### సమస్యలకు వెంటనే స్పందన

**రాజమహేంద్రవరం : జయ జయహే :జూలై 26:**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) 'మన వార్డులో.. మన ఆదిరెడ్డి' కార్యక్రమంలో భాగంగా రాత్రి బస అనంతరం ఆదివారం ఉదయం 37, 41, 42 డివిజన్లలో విస్తృతంగా పర్యటించారు.ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పెన్షన్లు, రేషన్ కార్డులు, ప్రభుత్వ గృహాలు, తాగునీటి సరఫరా, డ్రైనేజీలు, సీసీ రోడ్లు, వీధి దీపాలు, విద్యుత్ సమస్యలు, పారిశుద్ధ్యం, కాలువల శుభ్రత తదితర అంశాలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత శాఖల అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే, ఆలస్యం లేకుండా పరిష్కార చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, కార్యాలయాల్లో కూర్చొని వినడం కంటే ప్రజల గడప వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ప్రజల వద్దకే వచ్చి సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించడం పట్ల స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## పోర్టు స్టేడియం వాకర్స్ ఆధ్వర్యంలో విద్యార్థికి ఆర్థికసాయం

**విశాఖపట్నం జయ జయహే**

అక్కయ్యపాలెం ఎన్.జి.జి ఓ ఎస్ కాలనీలో గల మున్సిపల్ హైస్కూల్లో చదివి పదవ తరగతిలో 600 కు 458 మార్కులు సాధించడమే కాకుండా గణితంలో 100 కి 100 సోషల్ లో 100 కి 100 మార్కులు సాధించిన గంటపల్లి భవాని అనే విద్యార్థిని అభినందిస్తూ అక్కయ్యపాలెం పోర్ట్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ తరపున 5000 రూపాయలు నగదు బహుమతిని అందజేశారు. గంటపల్లి భవాని తల్లి గంటపల్లి శ్రీదేవి సీతమ్మదారలో ఒక ఇంటిలో ఇంటిపని, వంట పని చేసుకుంటూ ఇనార్బిట్ మాల్ వెనుక గల సత్యసాయి నగర్ లో నివాసం ఉంటు ముగ్గురు కుమార్తెలను కష్టపడి చదివించింది. ఆమెకి మూడో సంతానమైన గంటపల్లి భవాని 10వ తరగతిలో మంచి ఫలితాలు రావడంతో ఆ తల్లి ఆనందానికి అవధులు లేవు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ ప్రసాద్ రావు, కార్యదర్శి జి పి ఆర్ విఠల్, బొజ్జా రామయ్య మరియు పలువురు వాకర్సు పాల్గొన్నారు



## మిషన్ శక్తిశాట్‌కుఎంపికైన జెస్సీకి మంత్రి దుర్గేష్ అభినందనలు

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూలై 26:**

ప్రపంచంలోనే తొలి గ్లోబల్ ఆల్ గర్ల్స్ లూనార్ క్యూబ్‌శాట్ కార్యక్రమమైన మిషన్ శక్తిశాట్‌కు ఎంపికైన ధవళేశ్వరం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని కందుల జెస్సీని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో సత్కరించి అభినందించారు.దేశవ్యాప్తంగా ఎంపికైన 21 మంది విద్యార్థినుల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి జెస్సీ ఒక్కరే ఎంపిక కావడం రాష్ట్రానికే గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో పాల్గొనే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. శిక్షణ, పర్యటన కోసం అవసరమైన స్మార్ట్‌ఫోన్, విమాన టికెట్లు, వసతి ఉచితంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.మంత్రి దుర్గేష్‌ను జెస్సీ తల్లిదండ్రులుమర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు.



## ప్రారంభమైన వెంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక చింతా వారి వీధి లో గల దేవుని గుమ్మ అలివేలుమంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ వెంకటేశ్వర స్వామికి పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి అందులో భాగంగా ఆదివారం ఆలయావరణలో గల ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ కార్యక్రమం మరియు భక్త బృందం మహిళలచే విష్ణు సహస్రనామ పారాయణం పవిత్ర రోహనం కార్యక్రమాలు దేవాలయ అర్చకులు పులకడం ప్రసాద్ బాబు, రాజేష్ పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఆలయ పాలకవర్గ సభ్యులు కమిటీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు ఈవో కె చంద్ర తేజ ధర్మకర్తలు మడగల శ్రీనివాసరావు గుండా వెంకట సాయి,గోపాలరావు సిహెచ్ నూకరాజు, కొనతా ల అరుణ,శేషు లక్ష్మి భక్తులు తదితరులు పాల్గొన్నారు

## కాపు ఆత్మగౌరవానికి ప్రతీక ముద్రగడ.. ఆశయ సాధనే నిజమైన నివాళి

### రాజకీయాలకు అతీతంగా నివాళులర్పించిన కాపు నేతలు, అభిమానులు





**రాజమహేంద్రవరం: జయ జయహే: జూలై 26 :**

కడియం కాపు సమాజ హక్కులు, సంక్షేమం కోసం జీవితాంతం ఉద్యమ బాటలో నడిచిన దివంగత నాయకుడు ముద్రగడ పద్మనాభం సేవలు చిరస్మరణీయమని కాపు ఐక్య వేదిక నాయకులు కొనియాడారు. తూర్పుగోదావరి జిల్లా కడియంలోని జివిఎన్ఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఆదివారం నిర్వహించిన ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కాపు సంఘాల ప్రతినిధులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలో వెనుకబడిన కాపుల సంక్షేమం కోసం ఉద్యమ జెండా ఎగరవేసి, వారి హక్కుల సాధనకు నిరంతరం పోరాడిన నాయకుడు ముద్రగడ పద్మనాభమని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా కాపు జాతి కోసం ఆయన చేసిన ఉద్యమం చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినవారమవుతామని పిలుపునిచ్చారు.సభకు హాజరైన మాజీ ఎంపి గిరజాల వెంకటస్వామి నాయుడు, మాజీ డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు, ఎపిఐఐసి డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, అన్నందేవుల చంటి, రాజమహేంద్రవరం రూరల్ మాజీ కోఆర్డినేటర్ గిరజాల బాబు, వైసిపి నాయకులు రావిపాటి రామచంద్రరావు, తాడాల చక్రవర్తి, వెలుగుబంటి అచ్యుతరామ్, తిరుమలశెట్టి శ్రీనివాస్, దొంతంశెట్టి వీరభద్రయ్య, బిజెపి నాయకులు ఆకుల శ్రీధర్, బొరుసు సుబ్రమణ్యం, కూటమి నాయకులు గట్టి సుబ్బారావు, నరసయ్య, పాఠంశెట్టి రవి, ఆదిమూలం సాయిబాబా, బోడపాటి గోపి, ముద్రగడ జమ్మి, వెలుగుబంటి నాని, పాఠంశెట్టి రాంజీ, మల్లు శివ, బోడపాటి రాజేశ్వరి తదితరులు ముద్రగడ సేవలను స్మరించుకుంటూ ఘన నివాళు లర్పించారు.అంతకుముందు ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు, అభిమానులు "జోహార్ ముద్రగడ" అంటూ నినాదాలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో కాపు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి సభను విజయవంతం చేశారు."రాజకీయాలు వ్యక్తిగతం కావొచ్చు.. కానీ కాపు జాతి హక్కుల కోసం ముద్రగడ చేసిన ఉద్యమం సమాజానికి మార్గదర్శకం. ఆయన ఆశయ సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలి."

## దుర్గాలమ్మ జాతరకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి రూ. లక్ష విరాళం

### ప్రతి ఏడాది అమ్మవారి జాతరకు విరాళాలు

### వాసుపల్లి గణేష్ కుమార్ దాతృత్వంపై ఆలయ కమిటీ హర్షం

**విశాఖపట్నం, జూలై 26, జయ జయహే**



మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ దుర్గాలమ్మవారి జాతరకు లక్ష రూపాయలు విరాళం ఇచ్చారు. మద్రిపాలెం లోని ఆయన కార్యాలయంలో ఆదివారం కమిటీ సభ్యులకు సొంత నిధులతో నగదును అందజేశారు. ప్రతి ఏడాది ఈ ఉత్సవాలకు వాసుపల్లి గణేష్ కుమార్ ధన సహాయం అందజేస్తుంటారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలన్నారు.

**- గిరిప్రదక్షిణ విజయవంతం కావాలి...!**

ఈనెల 28 , 29న నిర్వహించే గిరిప్రదక్షిణకు సుమారు ఆరు లక్షల మంది భక్తులు తరలి వచ్చే అవకాశం ఉందని వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు.

పెద్ద సంఖ్యలో వస్తున్న భక్తులకు ఎటువంటి సమస్యలు తెలుచకుండా దేవస్థానం అధికారులు ఇటు అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. గత ఏడాది నిర్వహించిన గిరిప్రదక్షిణలో కొన్ని లోటుపాట్లు జరిగాయనే ప్రచారం జరిగిందని అన్నారు.ట్రాఫిక్ సమస్యలతో పాటు ఆ భక్తులు కూడా ఇబ్బందులకు గురయ్యారని పేర్కొన్నారు. ఊహించిన దానికంటే ఎక్కువ మంది రావడంతో ఈ సమస్య తలెత్తిందన్నారు. అధికారులు ముందుగా అప్రమత్తమై తగు చర్యలు తీసుకుంటే ఎటువంటి సమస్యలు రావని అన్నారు. ఈ యాడాది ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గిరి ప్రదక్షిణకు చాలా ప్రాధాన్యత ఉందన్నారు. మన రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందన్నారు. ఈ దృష్ట్యా పోలీసు శాఖ ట్రాఫిక్, ఆంక్షలు మళ్లింపులు చేయడం జరిగిందన్నారు. అయితే ప్రణాళిక బద్ధంగా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. భక్తులు మాత్రమే కాకుండా సామాన్య ప్రజలు కూడా ఇబ్బందులు పడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు.



## విక్టరీ ఎట్ సీ వద్ద జిల్లా కలెక్టర్ నివాళులు

**విశాఖపట్నం, జూలై 26, జయ జయహే**

కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని బీచ్‌రోడ్డులోని విక్టరీ ఎట్ సీ వద్ద జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అమర జవాన్లకు ఆదివారం నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం కార్గిల్ యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన వీర జవాన్ల సేవలు, త్యాగాలను స్మరించుకున్నారు. దేశ సరిహద్దుల రక్షణ కోసం సైనికులు చేసిన త్యాగం దేశ ప్రజలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రక్షణ రంగ అధికారులు పాల్గొన్నారు.

For a pure tomorrow..
జయహో

# ప్రజారోగ్యమే లక్ష్యంగా సంజీవని పథకం

(సి.హెచ్.ప్రతాప్)

ఆరోగ్యవంతమైన సమాజమే అభివృద్ధి చెందిన రాష్ట్రానికి పునాది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వాల అత్యంత ప్రాథమిక బాధ్యత. ఈ దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించిన 'సంజీవని' పథకం ప్రజారోగ్య వ్యవస్థలో నూతన మార్పులకు నాంది పలికే ప్రయత్నంగా కనిపిస్తోంది. ఇది కేవలం మరో సంక్షేమ పథకం మాత్రమే కాదు; వైద్య సేవలను ఆస్పత్రులకే పరిమితం చేయకుండా ప్రతి కుటుంబానికి చేరువ చేయాలనే సమగ్ర ఆలోచనకు ప్రతిరూపం. ఆరోగ్యాన్ని ఒక సేవగా కాకుండా ప్రతి పౌరుడి హక్కుగా గుర్తిస్తూ, ముందస్తు సంరక్షణకు ప్రాధాన్యం ఇచ్చే దృక్పథాన్ని ఈ పథకం ప్రతిబింబిస్తోంది.

భారతదేశంలో ఆరోగ్యరంగం గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల లభ్యత ఇప్పటికీ సవాలుగానే ఉంది. చిన్నచిన్న ఆరోగ్య పరీక్షల కోసం దూరప్రాంతాలకు ప్రయాణించాల్సి రావడం, నిపుణుల సేవలు అందుబాటులో లేకపోవడం, చికిత్స ఖర్చులు కుటుంబాలపై ఆర్థిక భారాన్ని మోపడం వంటి సమస్యలు అనేక కుటుంబాలను ఇబ్బంది పెడుతున్నాయి. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులు, మధుమేహం, రక్తపోటు, గుండెజబ్బులు వంటి అనారోగ్యాలను ఆలస్యంగా గుర్తించడం వల్ల చికిత్స ఖర్చులు మరింత పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్య సమాచారాన్ని డిజిటల్ రూపంలో నమోదు చేసి, అవసరమైన వైద్య సేవలను సమయానికి అందించే లక్ష్యంతో రూపొందిన సంజీవని పథకం ప్రజలకు విశ్వసనీయ ఆరోగ్య భరోసాను అందించే అవకాశాన్ని కల్పిస్తోంది.

ఈ పథకంలోని ప్రధాన బలం ముందస్తు ఆరోగ్య సంరక్షణ. వ్యాధి తీవ్రరూపం దాల్చిన తర్వాత చికిత్స చేయడం కంటే, ప్రారంభ



దశలోనే గుర్తించి తగిన వైద్యం అందించడం వల్ల ప్రాణనష్టం, వైద్య వ్యయం రెండూ తగ్గుతాయి. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్స్, క్రమానుగత ఆరోగ్య పరీక్షలు, టెలిమెడిసిన్ సేవలు, వైద్యుల సలహాలను సాంకేతికతతో అనుసంధానం చేయడం వంటి చర్యలు ప్రజారోగ్య నిర్వహణలో నూతన ప్రమాణాలను నెలకొల్పగలవు. ప్రతి వ్యక్తికి సమగ్ర ఆరోగ్య చరిత్ర అందుబాటులో ఉండటం వల్ల వైద్యులు మరింత ఖచ్చితమైన చికిత్స అందించే అవకాశం ఏర్పడుతుంది.

అలాగే గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి నిరంతర పర్యవేక్షణ కూడా సులభతరం అవుతుంది.


అయితే, ఏ సంక్షేమ కార్యక్రమం విజయవంతం కావాలన్నా దాని అమలే కీలకం. సంజీవని పథకం కూడా ఇందుకు మినహాయింపు కాదు. గ్రామ సచివాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రులు, వైద్య సిబ్బంది, సాంకేతిక వ్యవస్థల మధ్య సమర్థవంతమైన సమన్వయం అవసరం. ఆరోగ్య కార్యకర్తలకు తగిన శిక్షణ, డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ, డేటా భద్రత, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఆరోగ్య సమాచార గోప్యతను కాపాడుతూ సేవలు అందించడం కూడా అత్యంత కీలకమైన బాధ్యత.

ఈ పథకం విజయవంతమైతే వైద్య సేవలు మరింత ప్రజలకు చేరువవుతాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే చికిత్స పొందగలుగుతాయి. అనవసర ప్రయాణాలు, అధిక వైద్య ఖర్చులు తగ్గడమే కాకుండా, వ్యాధుల నివారణకు అవసరమైన అవగాహన కూడా పెరుగుతుంది. ప్రజారోగ్యంపై సమగ్ర సమాచారం ప్రభుత్వానికి అందుబాటులో ఉండటం వల్ల వ్యాధుల వ్యాప్తిని ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు తీసుకునే అవకాశం కూడా లభిస్తుంది.సంజీవని పథకం మరో ముఖ్యమైన సందేశాన్ని కూడా ఇస్తోంది. ఆధునిక సాంకేతికతను ప్రజా సంక్షేమంతో అనుసంధానిస్తే పాలన మరింత సమర్థవంతంగా మారుతుందనే విషయాన్ని ఇది స్పష్టం చేస్తోంది. ఆరోగ్య సేవలను ప్రజల ఇంటి ముంగిటకు చేర్చడం ద్వారా సమాన ఆరోగ్య అవకాశాలను కల్పించాలనే లక్ష్యం ప్రశంసనీయం. దీర్ఘకాలంలో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఇలాంటి కార్యక్రమాలు బలమైన పునాదిగా నిలుస్తాయి.

మొత్తంగా, సంజీవని పథకం ప్రజారోగ్యాన్ని చికిత్స కేంద్రిత విధానం నుంచి నివారణ, ముందస్తు సంరక్షణ, డిజిటల్ ఆరోగ్య నిర్వహణ వైపు మలిచే కీలక అడుగు. ఈ పథకం విజయవంతం కావడం ప్రభుత్వం, వైద్య వ్యవస్థ, ఆరోగ్య కార్యకర్తలు, ప్రజల భాగస్వామ్యంపై ఆధారపడి ఉంటుంది. సమర్థవంతమైన అమలు, నిరంతర పర్యవేక్షణ, ప్రజల విశ్వాసం ఈ కార్యక్రమానికి తోడైతే, సంజీవని నిజంగానే ప్రజారోగ్యానికి కొత్త దిశను చూపే మైలురాయిగా నిలుస్తుంది.

## సామాజిక చైతన్యానికి ప్రతీక దాశరథి

(సి.హెచ్.ప్రతాప్)



**దాశరథి రంగాచార్య తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడు. ఆయన కేవలం నవలా రచయిత మాత్రమే కాదు; ఉద్యమకారుడు, సామాజిక చైతన్యవేత్త, భాషాభిమాని, తెలంగాణ ఆత్మను అక్షరాల్లో ఆవిష్కరించిన సాహితీ యోధుడు. 1928 ఆగస్టు 24న నేటి మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరులో జన్మించిన ఆయన, నిజాం పాలనలో ప్రజలు అనుభవించిన అణచివేత, వెట్టిచాకిరి, సామాజిక అసమానతలను ప్రత్యక్షంగా చూసి పెరిగారు. ఆ అనుభవాలే ఆయన కలానికి దిశానిర్దేశం చేశాయి. తెలంగాణ సాయుధ పోరాటంలో క్రియాశీలంగా పాల్గొన్న ఆయన, తుపాకీతో పాటు కలాన్ని కూడా ప్రజా విముక్తి సాధనంగా మలిచారు.**

దాశరథి రంగాచార్య రచనల్లో తెలంగాణ నేల, ప్రజల జీవనవాస్తవాలు, వారి పోరాటస్ఫూర్తి సహజంగా ప్రతిఫలిస్తాయి. ఆయన అత్యంత ప్రసిద్ధ నవల "చిల్లర దేవుళ్లు" తెలంగాణ గ్రామీణ సమాజంలోని దోపిడీ వ్యవస్థను, సామాన్య ప్రజల జీవిత వేదనను హృద్యంగా ఆవిష్కరించింది. ఈ నవలకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం లభించగా, అది సినిమా, రేడియో నాటక రూపాల్లోనూ విశేష ఆదరణ పొందింది. "మోదుగుపూలు", "జనపదం", "మాయ జలతారు", "అమృతంగమయ", "పావని" వంటి నవలలు తెలంగాణ సామాజిక, రాజకీయ పరిణామాలను సాహిత్య రూపంలో చరిత్రగా నిలిపాయి. ఆయన ఆత్మకథ "జీవనయానం" వ్యక్తిగత అనుభవాలతో పాటు తెలంగాణ ఉద్యమ చరిత్రను ప్రతిబింబించే విలువైన గ్రంథంగా నిలిచింది.

రంగాచార్య విశిష్టత కేవలం నవలా రచనలకే పరిమితం కాలేదు. వేదాలు, రామాయణం, మహాభారతం వంటి మహాగ్రంథాలను సరళమైన తెలుగులో అందించి సాధారణ పాఠకుడికి చేరువ చేశారు. వేదాలను తెలుగులోకి అనువదించిన అరుదైన సాహితీవేత్తగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ అసాధారణ సేవకు గుర్తింపుగా ఆయనకు "అభినవ వ్యాసుడు" అనే బిరుదు లభించింది. క్లిష్టమైన శాస్త్రగ్రంథాలను సులభమైన భాషలో ప్రజలకు అందించడం ద్వారా సాహిత్యం ప్రజల జీవితాలతో మమేకం కావాలని ఆయన విశ్వసించారు.

తెలంగాణ మాండలికాన్ని సాహిత్య భాషగా గౌరవప్రదమైన స్థానంలో నిలబెట్టిన రచయితల్లో దాశరథి రంగాచార్య అగ్రగణ్యుడు. సాంప్రదాయ రచయితలు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, ప్రజలు మాట్లాడే భాషలోనే రచనలు చేయాలని ఆయన పట్టుదలగా నిలిచారు. తెలంగాణ యాసలో రచనలు చేస్తే అవి సాహిత్య విలువ కోల్పోతాయనే అపోహలను ఆయన తన కలంతో చెరిపివేశారు. ఆయన రచనల ద్వారా తెలంగాణ భాషకు సాహిత్య గౌరవం లభించింది. అందువల్ల ఆయన సాహిత్యం తెలంగాణ సంస్కృతికి, చరిత్రకు, ప్రజల భావజాలానికి ప్రామాణిక పత్రంగా నిలిచింది.

ఆయన వ్యక్తిత్వంలోని నిష్కపటత్వం, నిర్మొహమాటం నేటి తరానికి ఆదర్శం. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె.వి. రమణాచారి ఒక సందర్భంలో మాట్లాడుతూ, "నేటి సమాజంలో నిజాయితీగా, ఉన్నదున్నట్లు మాట్లాడే వ్యక్తులు అరుదవుతున్నారు. దాశరథి రంగాచార్యలాంటి మహనీయుల నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలి. ఆయన ఏ విషయాన్నైనా నిర్భయంగా చెప్పేవారు; తెలంగాణ గుర్తింపును ఎప్పుడూ మరచిపోలేదు, ఇతరులు మరచిపోనీయలేదు" అని పేర్కొన్నారు. పురస్కారాలు, సన్మానాల కంటే ప్రజల ప్రేమనే ఆయన గొప్ప గుర్తింపుగా భావించేవారని కూడా ఆయన గుర్తుచేశారు.

దాశరథి రంగాచార్య సాహిత్యానికి మరో ప్రత్యేకత సమాజాన్ని విమర్శించడమే కాక, దానికి మార్గదర్శకత్వం చూపడం. ఆయన రచనల్లో మానవ సమానత్వం, సామాజిక న్యాయం, స్వేచ్ఛ, ఆత్మగౌరవం వంటి విలువలు ప్రతి పుటలో ప్రతిధ్వనిస్తాయి. అందుకే ఆయన రచనలు కాలానుగుణంగా మాత్రమే కాక, కాలాతీతంగా కూడా నిలిచాయి. నేటి యువత ఆయన రచనలను చదవడం ద్వారా తెలంగాణ చరిత్రను మాత్రమే కాదు, సమాజం పట్ల బాధ్యత, నిజాయితీ, ప్రజాసేవ వంటి ఉన్నత విలువలను కూడా అలవర్చుకోవచ్చు.

2015 జూన్ 8న దాశరథి రంగాచార్య భౌతికంగా దూరమైనప్పటికీ, ఆయన సాహిత్యం నేటికీ ప్రజల హృదయాల్లో సజీవంగానే ఉంది. తెలంగాణ చరిత్రను, సంస్కృతిని, ప్రజల ఆత్మగౌరవాన్ని అక్షరాల్లో శాశ్వతం చేసిన మహోన్నత సాహితీవేత్తగా ఆయన చిరస్మరణీయుడు. నిజాయితీ, ప్రజాసేవ, భాషాభిమానం, సామాజిక బాధ్యతల సమ్మేళనమైన ఆయన జీవితం ప్రతి రచయితకు, ప్రతి పాఠకుడికి శాశ్వత స్ఫూర్తి.

# దక్షిణ భారతదేశంలో చాలా ప్రసిద్ధమైన వైష్ణవ క్షేత్రం సింహాచలం

**పురాణ గాధ:**

ప్రహ్లాదుడు మరియు వరాహస్వామి.

క్షేత్ర గాధ :

**రాక్షస రాజు అయిన హిరణ్యకశిపుడు బ్రహ్మ వరం వల్ల గర్వంతో నన్ను తప్ప ఎవరిని పూజించవద్దు అన్నాడు కానీ ఆయన కుమారుడు పుట్టుకతోనే విష్ణు భక్తుడు తన తండ్రి ఎన్ని హింసలు పెట్టినా ప్రహ్లాదుడు**

" ఓం నమో నారాయణాయ " అంటూ పరితపించేవాడు. కోపంతో హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడని చంపడానికి చూశాడు అప్పుడు విష్ణువు నరసింహ అవతారంలో వచ్చి హిరణ్యకశివుని సంహరించాడు.



**వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఆవిర్భావం :**

ప్రహ్లాదుడు శాంతి కోసం తపస్సు చేశాడు స్వామి నువ్వు నాకు ప్రత్యక్షం కావాలి అని కోరాడు. అప్పుడు శ్రీమహావిష్ణువు వరాహరూపంలో ఈ సింహాచల కొండపై వెలిశారు. స్వామివారి ముఖం వరాహ రూపం శరీరాకృతి సింహ రూపం మరియు మనిషి ఆకృతి.

ప్రహ్లాదుడు కోరిక మేరకు శ్రీమహావిష్ణువు వరాహ రూపంలో నరసింహ రూపంలో కలిసి వరాహ నరసింహగా సింహాచలం కొండపైన ఆవిర్భవించారు.

**స్వామివారి ప్రత్యేకత:**

1. చందన కప్పు :-మూడు అడుగుల మందంతో చందన పూతగా స్వామివారి ఒంటినిండా చందనాన్ని కప్పి ఉంచుతారు.
2. అసలు రూపం :- సింహం ముఖం మనిషి శరీరం వరాహ నాసికం కలిసిన దివ్యమైన సుందరమైన ప్రశాంత రూపం.
3. నిజరూప దర్శనం:- సంవత్సరంలో వైశాఖ శుద్ధ తదియ నుండి వైశాఖ బహుళ తదియ వరకు 12 రోజులు మాత్రమే చందనం తీసి అసలు రూపంతో స్వామి వారు దర్శనమిస్తారు దానినే చందన ఉత్సవం అంటారు భక్తులు ఆ రోజు నా సింహాద్రి అప్పన్న ఎంతో ప్రేమగా ప్రసన్నంగా కొలుచుకొని సింహాద్రి అప్పన్న స్వామి అని పిలుచుకుంటారు.

**సింహాచల దేవస్థానం ఆలయ విశేషాలు:**

1.దేవుడు :-శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి.

2.ఎత్తు :-సముద్రమట్టానికి ఎనిమిది వందల అడుగుల ఎత్తు.

3. నైవేద్యం :-పులిహోర స్వామికి నిత్యము నివేదన చేసి భక్తులందరికీ ఉచిత ప్రసాదాన్ని ఇస్తారు. అత్యంత ప్రీతికరమైన ప్రసాదం స్వామి వారికి పులిహోర.

4. గిరి ప్రదక్షణ:- ఆషాడ మాసంలో శుద్ధ పౌర్ణమి నాడు 32 కిలోమీటర్లు కొండ చుట్టూ నడిస్తే ఏడు జన్మల పాపాలు పోతాయి 1000 అశ్వమేధ యాగాల ఫలితం లభిస్తుంది అని అశేష జన వాహిని యొక్క ప్రగాఢ పురాతన నమ్మకం.

5. మొక్కులు తీర్చే దేవుడు ఆ సింహాద్రి అప్పన్న స్వామి:- అప్పన్న మొక్కు అనే నానుడి ఎంతో పురాతన కాలం నుంచి ఉంది అప్పన్నని ధర్మబద్ధమైన ఏ ముక్కు మొక్కిన వెంటనే తప్పక తీర్చే స్వామి.

6. సంతాన ప్రాప్తి:- అంత అంతరాలయంలో ఉన్న అతి పురాతన ప్రాచీన కట్టడమైన కప్ప స్తంభాన్ని ఆలింగనశీ,చేసుకుంటే మన మనస్ఫూర్తిగా నమస్కరించుకుంటే సంతానం కోసం మొక్కుకుంటే తప్పక సంతానం కలుగుతుంది అని ప్రాంత వాసుల నమ్మకం.

**గిరి ప్రదక్షణ :-**

ప్రహ్లాద భక్తికి మెచ్చి స్వామి కొండపైన వెలిశారు. కొంతమంది భక్తులు అప్పట్లో కొండ ఎక్కలేక తొలి పావంచా నుండి కొంత దూరం అంటే 32 కిలోమీటర్లు దరిదాపుగా అంతా కాలినడకన మంచి ఆలోచనతో మనసు ప్రశాంతతతో ప్రదక్షిణలు చేసేవారు ఇలా చేసిన భక్తులకు కోరిన కోర్కెలు తీరడం సంతానం కలగడం ఆరోగ్యం మెరుగు పడటం జరిగింది ఇలా కార్యక్రమం ఇదే మార్గాన్ని భక్తులందరూ అనుసరించారు.

త్రేతా యుగంలో రాముడు లక్ష్మణుడు కూడా ఈ కొండ చుట్టూ తిరిగేరని స్థలపురాణం చెబుతున్నది.

**గిరి ప్రదక్షణ నియమ నిబంధనలు:-**

1. ఒకరోజు ముందు నుంచి ఉపవాసం చేసి మాంసము మధ్యము తీసుకోకుండా ఉండడం.
2. తెల్లని వస్త్రములు మాత్రమే ధరించవలెను.
3. పాదరక్షకలు ధరించకూడదు.
4. ప్రదక్షిణ సమయంలో దారి పొడవునా హరినామ స్మరణ మాత్రమే చేయాలి గోవిందా గోవిందా అంటూ అడుగులు ముందుకు వేస్తూ సాగాలి.

**తప్పనిసరిగా ఆచరించవలసిన మరికొన్ని నియమములు:-**

1.భక్తులు చేతిలో టార్చ్ లైట్ నీళ్ల సీసా రైన్ కోట్ తప్పకుండా తీసుకు వెళ్ళవలెను.
2. సమూహంగా వెళ్లాలి.
3. ఒంటరి ప్రయాణం వద్దు.
4. వృద్ధులు పిల్లలు ఉంటే చాలా నెమ్మదిగా నడవాలి.
5. చంటి పిల్లలతో గిరిప్రదక్షిణ చేయడం ఉత్తమమైనది కాదు.
6. వయోవృద్ధులతో గిరిప్రదక్షిణ సామాన్యమైన విషయం కాదు కనుక చెయ్యకపోవడమే మంచిది.

**ప్రభుత్వ సేవలు**

మార్గమధ్యంలో 32 కిలోమీటర్లు దూరాన వరకు ప్రభుత్వం అనేక రకాలైన ఆరోగ్య వైద్య మంచినీరు ఉచిత ఆహారం మొదలగు సేవలన్నీ కూడా ఇవ్వడం జరుగుతున్నది కనుక భక్తుల వినియోగించుకుంటూ సదా స్వామిని మనసులో ప్రార్థించుకుంటూ గిరిప్రదక్షిణ సంపూర్ణంగా ముగించాలి.

ఇది కేవలం నడక కాదు ఇది మనం అహంకారం సోమరితనం వదిలేసి స్వామికి దగ్గర అయ్యే భక్తి మార్గం.

పౌర్ణమి రోజు రాత్రి అంతా నడిచి మరునాడు ఉదయం 6 7 గంటల సమయంలో స్వామి దర్శనం చేసుకుని చందనం ప్రసాదముగా తీసుకుని వ్రతాన్ని పూర్తి చేయాలి.



ఆధ్యాత్మికవేత్త ప్రవచనకర్త తెలుగు ఆచార్యులు

ఏ. బాల సౌజన్య కుమారి

# విశాఖలో ఆర్గానిక్ ప్లాజా ఏర్పాటుకు కృషి చేద్దాం






### ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతులు పెరగాలి

### ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి... ఎన్ తేజ్ భరత్,

**విశాఖపట్నం (జయ జయహే)**

విశాఖ లో ఆర్గానిక్ ప్లాజా ఏర్పాటుకు కృషి చేద్దాం అని విఎంఆర్డిఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ ప్రకటించారు. ఆదివారం ఆంధ్రా విశ్వవిద్యాలయం లోని ఎ హబ్ వద్ద ప్రకృతి వ్యవసాయదారుల సంతలో ఆయన మాట్లాడారు. ముందుగా సంతలో రైతులు ఏర్పాటు చేసిన దుకాణాలు పరిశీలించి, రైతుల కష్టనష్టాలు అడిగి తెలుసుకున్నారు. వారి పంటల దిగుబడి, క్రయవిక్రయాలు గురించి తెలుసుకున్నారు. అనంతరం గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ "మన కూరగాయలు తోట" కార్యక్రమంలో భాగంగా బత్తిలి, వంజంగి వంగ, దేశీయ బంతి, టమాటా, గుంటూరు పచ్చి మిర్చి నారు పంపిణీ చేసి అనంతరం మాట్లాడారు. ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతుల కోసం తప్పకుండా ఆర్గానిక్ ప్లాజా మంచి ప్రదేశం లో ఏర్పాటు చేద్దాం అని అన్నారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకుని ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం, అలా పండించే రైతులకు ప్రోత్సాహం కల్పించడం అవసరం అని వివరించారు. దీనికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్గానిక్ ప్లాజా ఏర్పాటు విశాఖ నగర ప్రజలకు, పర్యాటకులకు, ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతులకు ఉపయుక్తంగా ఉ ంటుంది అని వివరించారు. ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతులు పెరగాలని కోరారు. స్వయం సహాయక సంఘాలు ప్రకృతి పంటల ఉత్పత్తులు తయారు చేయాలి అని పిలుపునిచ్చారు. రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతులు రిషి, త్రినాథ్, జగదీష్, రాజు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, సమన్వయకర్తలు భాస్కర్, జె రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# పనిచేయని మంత్రులు రాజీనామా చేయండి

**అనకాపల్లి జయ జయహే**



నీట్ పరీక్షల్లో పేపర్లు లీక్ పై చర్యలు తీసుకోవడంలో విఫలమైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయించడం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వానికి నిదర్శనమని మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ నాయకులు దాడి వీరభద్ర రావు మీడియాతో పేర్కొన్నారు అంతా ప్రధాని చూసుకుంటాడు మనకెందుకు శ్రమ అనుకునే కొందరు మంత్రులు వలన ప్రధాని పైన ప్రభుత్వం పైన కూడా ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని మంత్రులు తమ శాఖలలో జరుగు అక్రమాల పైన సమస్యల పైన నిష్క్రియా విధానాన్ని అనుసరించడం రాజేద్రోహం అని ఆయన పేర్కొన్నారు 2022లో పేపర్ లీక్ వలన ఎనిమిది మంది 2026లో పేపర్ లీక్ వలన సుమారు 21 మంది విద్యార్థులు ఆత్మహత్య పాలపడితే ప్రశ్న పేపర్లను ఉత్తర దేశం వారికి అమ్ముకునే మాఫియా పై కేంద్ర ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంది అని ఆయన ప్రశ్నించారు పరీక్షలు నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చైర్మన్ ఒకరోజు నిందితులు దొరికారు పట్టుకున్నామని చెప్పిన కొద్ది గంటల్లోనే అసలు లీకే జరగలేదని ప్రకటించడం చూస్తే అతడే దోష ని అనిపించడం లేదా అతని తొలగించి క్రిమినల్ చర్యలు ఎందుకు తీసుకోలేదు ఎన్నిసార్లు ఇలాగ విద్యార్థుల జీవితాలతో ఈ మాఫియా నాయకులు చలగాటం ఆడతారు ఈ లీకుల మాఫియా వెనక ఎవరున్నారు అసంఘటితమైన విద్యార్థులోకం 36 రోజు ఢిల్లీలో ఉద్యమం చేస్తే వారిపై పోలీసులు చేసిన దమనకాండ కు ఎవరు కారకులు పైగా కొందరు మంత్రులు ఇది విదేశీ కుట్ర అని విదేశీ నిధులతో జరిగే అసాంఘిక చర్యలని ప్రకటించడం బాధ్యత రాహిత్యం కాదా అటువంటి మంత్రులు క్యాబినెట్లో కొనసాగడం అవసరమా ఆనాడు ఎన్టీ రామారావు బడ్జెట్ లీకైనందుకు నాతో సహా 31 మంది మంత్రుల చేత రాజీనామా ఇప్పించారు పేపర్ లీక్ అయినందుకు విద్యామంత్రి ముద్దుకృష్ణమనాయుడు ఆనాడు రాజీనామా చేశారు వంగవీటి రంగ హత్య జరిగినప్పుడు హోం మంత్రి కోడెల శివప్రసాద్ చేత రాజీనామా చేయించి ఆనాడు డి జే పి రామ్మోహన్ నారాయణ ని సెలవు పై పంపించి వేశారు పైగా ఆ సంఘటనపై సిబిఐ విచారణ చేయించారు. జనార్దన్ రెడ్డి బంధుప్రీతితో కొత్త ఇంజనీరింగ్ మరియు మెడికల్ కాలేజీ అనుమతి ఇచ్చినందుకు తెలుగుదేశం పార్టీ ఆనాడు ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వానికి డిమాండ్ చేయడంతో అయినా చేత రాజీనామా చేయించడం జరిగింది ఇలాగే అందరూ ఆయా శాఖ మంత్రులు నైతిక బాధ్యతతో రాజీనామా చేసినవాళ్లు ఉన్నారు లాల్ బహుదూర్ శాస్త్రి, టిటి కృష్ణమాచారి నితీష్ కుమార్ శివరాజు పాటిల్,మాధవరావు సింధియా ఎందరో ఇలాగ తమ తప్పుకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారు ఆనాడు, అటువంటి కనీస బాధ్యత ఇప్పటి కేంద్ర మంత్రులకు లేదా విద్యార్థులను రెచ్చగొట్టి ఢిల్లీలో 16 మెట్రో స్టేషన్లను మూడు రోజులపాటు మూసివేసి విద్యార్థులను ఒకపక్క లాఠీ చార్జి చేసి అరాచకాని సృష్టించేవరకు కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయికపోవడం ఒక వింత, ప్రధానమంత్రి ఈ లీకుల మాఫియాకి కఠిన శిక్షలు విధించేలాగా చట్ట సవరణలు చేయడానికి నిర్ణయించారు వారికి 10 సంవత్సరాలు జైలు శిక్ష పది కోట్లు రూపాయలు జరిమానా కింద కోర్టులు పై కోర్టులు మూడు నెలలు దాటకుండా తీర్పులు ఇచ్చేలా పార్లమెంటులో సవరణకు పూనుకోవడం విద్యార్థుల జీవితాలు మంచిగా పరిణామం అని పేర్కొన్నారు కాక్రోచ్ బొద్దింకల పార్టీ పుట్టడానికి కారకులైన సుప్రీంకోర్టు పెద్దలు కూడా ఈ స్కాం మాఫియా పైన పోలీసు దమనకాండ విచారణ జరిపించే కఠినంగా శిక్షించాలని దాడి వీరభద్ర రావు డిమాండ్ చేశారు

# అక్రమ లేఔట్‌లలో స్థలాలు కొనొద్దు....!

### కొనుగోలు చేసి ఇబ్బందులు పడొద్దు

### వీఎంఆర్డిఏ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్

**విశాఖపట్నం, జూలై 26, జయ జయహే :**

విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో అనుమతులు లేని అక్రమ లేఔట్లలో స్థలాలను కొనుగోలు చేసి ఇబ్బందులకు గురికావద్దని వీఎంఆర్డిఏ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటనలో సూచించారు. భవిష్యత్తు ఆర్థిక అవసరాల కోసం అదేవిధంగా సొంత ఇంటి కలను నెరవేర్చుకునే దిశగా చాలామంది అప్రూవల్ లేని స్థలాలు తక్కువ ధరకు వస్తున్నాయని కొనుగోలు చేస్తున్నారని, కొంతమంది వ్యక్తులు లేదా సంస్థలు సంబంధిత అధికారుల అనుమతులు లేకుండా లేఔట్లు అభివృద్ధి చేసి, ఆకర్షణీయమైన ప్రకటనల ద్వారా



ప్రజలను మోసగించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అటువంటి లేఔట్లలో స్థలాలు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో చట్టపరమైన, ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. స్థలం కొనుగోలు చేసే ముందు ఆ లేఔట్‌కు సంబంధిత స్థానిక సంస్థల నుంచి అవసరమైన అనుమతులు ఉ న్నాయా లేదా అనే విషయాన్ని తప్పనిసరిగా ధృవీకరించుకొని మాత్రమే అధికారిక అనుమతులు ఉన్న లేఔట్లలో మాత్రమే స్థలాలు కొనుగోలు చేసి, మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరుతున్నామన్నారు. లేఔట్‌కు చట్టబద్ధమైన అనుమతి లేకపోవడంవల్ల ఇంటి నిర్మాణానికి అనుమతి నిరాకరించే అవకాశం ఉంటుందన్నారు. చాలా బ్యాంకులు ఆమోదం లేని లేఔట్‌లలోని ప్లాట్లకు హోం లోన్ సౌకర్యం కల్పించదన్నారు. ఇటీవల భోగాపురం పరిసర ప్రాంతాల్లో అనేకమైన అనధికార లేఅవుట్ల చాలా వెలుస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని, ఇకపై ఇటువంటి అక్రమ లేఔట్ల మరియు అక్రమ భవన నిర్మాణాల నియంత్రణ విషయంలో కఠినముగా వ్యవహరిస్తుందన్నారు.

# విద్యార్ధినికి జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యే రోషన్

### కాపు సంక్షేమ సంఘం కె9 నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే





**జంగారెడ్డిగూడెం, జయ జయహే**

మాటకు కట్టు బడి ఉండే ఉత్తమ లక్షణం కాపు సామాజిక వర్గానిదని అందు వల్లనే పవన్ కళ్యాణ్ ముఖ్య మంత్రి చంద్రబాబు మధ్య చక్కని అనుబంధంఏర్పడిందని వారి భాగ స్వామ్యం తోనే కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథం లో ముందుకు దూసుకు పోతున్నదని స్థానిక చింతలపూడి శాసన సభ్యుడు సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు.

కాపు సంక్షేమ సంఘం కె9 నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం రోటరీ కమ్యూనిటీ హాల్లో జరిగింది. ముఖ్య అతిథి రోషన్ కుమార్ నూతన కమిటీ ని అభినందిస్తూ గత ఏడాది 70సేవ సంక్షేమకార్యక్రమాలు చేయటం అభినందనీయం అన్నారు. నూతన పాలక వర్గానికి తన వంతు సహకారం అందిస్తానని వాగ్దానం చేసారు.అధ్యక్షుడు కృష్ణం రాజు మాట్లాడుతూ గత పాలక వర్గం సేవలు మరింతగా విస్తృత పర్చు తాం అన్నారు. సంఘం కోసం రాఘవ రాజు శ్రీనివాస్ రూ 70వేలతో ఫ్రీజర్ బాక్స్ డొనేట్ చేశారని తెలిపారు. అలాగే మరి కొందరు దాతలు కైలాస రథం, అంబులెన్సులు ఇవ్వ నున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టెన్త్ లో ప్రతిభ చూపించిన 9మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.ఒక బాలిక కు సైకిల్ బహుకరించారు.కె9 నూతన అధ్యక్షుడు శీలం కృష్ణం రాజు, సెక్రటరీ పి మోహన్, ట్రెజరర్ జి ఆనంద్ ప్రసాద్ ఉపాధ్యక్షుడు బుద్దాల అనిల్ కుమార్ , సహాయకార్యదర్శి ఎం. సత్యనారాయణ మరో 9మంది అనుబంధవిభాగాల అధ్యక్షులతో కె 9గౌరవ అధ్యక్షుడు దాకారపు కృష్ణ ప్రమాణం చేయించారు. కార్యక్రమం లో పట్టణ టిడిపి అధ్యక్షుడు కొండ్రెడ్డికిషోర్ కె 9పూర్వపు అధ్యక్షుడు టి. శ్రీనివాస్ మాజీ డి సి సి బి చైర్మన్ కరాటం రాంబాబు, మాజీ ఏ ఎం సి చైర్మన్లు జెట్టి గురునాధ రావు, పారేపల్లి రామారావు జెడ్ పి టిసి పోల్నా టి బాబ్జి,రావూరి కృష్ణ, వలవల తాతాజీ, ఆకుల రాకేష్, పాల పర్తి శ్రీనివాస్,కుక్కల మాధవ, రాఘవరాజు శ్రీనివాస్,రాఘవ రాజు అదివిష్ణు తదితర కాపు నాయకులు పాల్గొన్నారు.



# ప్రమాద రహిత రవాణా లక్ష్యంగా ఎపిఎస్ఆర్టిసి భద్రతా వారోత్సవాలు ప్రారంభం

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూలై 26**

ప్రయాణికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ ప్రమాద రహిత రవాణా లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భద్రతా వారోత్సవాలు--2026 రాజమహేంద్రవరం డిపోలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జూలై 25 నుంచి 31 వరకు నిర్వహించనున్న వారోత్సవాల ప్రారంభ కార్యక్రమం స్థానిక డిపో గ్యారేజీలో డిపో మేనేజర్ కె. మాధవ్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సబ్-ఇన్‌స్పెక్టర్ డి. రామ్‌కుమార్ మాట్లాడుతూ, రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి భద్రతా వారోత్సవాలు ఎంతో దోహదపడతాయని, డ్రైవర్లు నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.మరో ముఖ్య అతిథి డిపిటిఓ వై.ఎస్.ఎన్. మూర్తి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రమాద రహిత డ్రైవింగ్‌లో ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్లు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో "సున్నా ప్రమాదాలే మన లక్ష్యం" అనే నినాదంతో ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి, ప్రయాణికుల భద్రతకు కట్టుబడి ఉండాలని సూచించారు.డిపో మేనేజర్ కె. మాధవ్ మాట్లాడుతూ, సంస్థలో ప్రతి ఉద్యోగి భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ప్రయాణికుల ప్రాణ భద్రతే సంస్థకు అత్యున్నత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు భద్రతా ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ఎం. అజయ్‌బాబు, ఏఎంఎఫ్ మూర్తి, డ్రైవర్లు, కండక్టర్లు, ట్రాఫిక్ సిబ్బంది, గ్యారేజీ సిబ్బంది, యూనియన్, అసోసియేషన్ నాయకులు, సెక్యూరిటీ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# విజయవంతమైన ఉచిత మెగా మెడికల్ క్యాంప్

**విశాఖపట్నం జయ జయహే**

విశాఖపట్నం పోర్ట్ మరియు డాక్ ఎంప్లాయీస్ సెక్టార్--6 రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, చాణక్య హెల్త్ కన్సల్టెన్సీ సారథ్యంలో భద్రం సామాజిక భవనం, సెక్టార్--6, ఎం.వి.పి కాలనీలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్ కు ప్రజలు భారీగా తరలి వచ్చారు చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు అన్ని వర్గాల ప్రజలు వైద్య సేవలు పొందారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు తెలుగు దేశం జిల్లా అధ్యక్షులు మరియు విశాఖ పార్లమెంట్ టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షులు, అలాగే అసోసియేషన్ అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరామ్ బీజేపీ జిల్లా అధ్యక్షులు యం యం ఎన్. పరశురామరాజు, 18వ వార్డు మాజీ కార్పొరేటర్ జి. మంగవేణి పోలారావు పాల్గొని మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. ప్రజల ఆరోగ్యంపై ఇలాంటి కార్యక్రమాలు మరింత అవసరమని వారు పేర్కొన్నారు.ఈ మెడికల్ క్యాంప్‌లో ప్రముఖ వైద్య నిపుణులు డా. ఆర్. గీత వందన , డా. వై. రజని ప్రియ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. మహిళల ఆరోగ్య సమస్యలు, సాధారణ వ్యాధుల పరీక్షలు, క్యాన్సర్ సంబంధిత అవగాహన, ప్రారంభ దశలో గుర్తింపు వంటి అంశాలపై ప్రత్యేకంగా మార్గదర్శకత్వం ఇచ్చారు.క్యాంప్‌లో బీపీ, షుగర్, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి వైద్య సలహాలు, జీవనశైలి మార్పులపై సూచనలు ఇచ్చారు. వైద్యులు ప్రతి రోగిని ఓపికగా పరిశీలించి, నాణ్యమైన సేవలు అందించడం విశేషం.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అసోసియేషన్ లీగల్ సెల్ అడ్వైజర్ డి. అరుణ కుమారి ప్రెసిడెంట్ కె. రాము సెక్రటరీ బి. లక్ష్మణరావు వైస్ ప్రెసిడెంట్ ఎం. సూరిబాబు జాయింట్ సెక్రటరీ పి. అప్పలరాజు మరియు కమిటీ సభ్యులు ఎం. అప్పాజీరాజు, ఎల్. సత్యం, డి. రజినీకాంత్, ఆర్. కేశవరావు, అల్లా భక్ష్య, పి. నలనరావు తదితరులు విశేషంగా శ్రమించారు.




# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన సదస్సు

**శ్రీకాళహస్తి, జులై 26,జయ జయహే**

శ్రీకాళహస్తి శ్రీరామ్ నగర్ కాలనీలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రకృతి యోగ జీవన విధానం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నేచురోపతి ప్రచారకులు యోగ మాస్టర్,వికాస్ విద్యాసంస్థల స్థాపకులు పోచినేని సురేష్ నాయుడు ముఖ్య వక్తగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ యోగ జీవన విధానంతో సర్వ రోగాలకు దూరంగా ఉండవచ్చని వివరించారు. ఆహార, విహార, వ్యవహార, విశ్రాంతి నియమాలు పాటిస్తూ...యోగ-ప్రాణాయామాలను క్రమం తప్పకుండా చేస్తే దీర్ఘకాలంవ్యాధి రహితంగా జీవించవచ్చని సూచించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు మల్లెమాల ప్రమీల, కార్యదర్శి డాక్టర్ మ్యాగీ క్లారా,మాజీ అధ్యక్షులు ఒరుగొండ వేణుగోపాల్,స్పీకర్ బ్యాంకు చైర్మన్ పిళ్ళారి బత్తినయ్య,రిటైర్డ్ సెంట్రల్ బ్యాంకు మేనేజర్ వెంకటముని,వాకచర్ల భార్గవ మూర్తి,ఆర్కె ప్రసాద్,డాక్టర్ వెంకట రామన్,శ్యామ్ జి, రోటరీ సభ్యులు కుసుమ గణేష్,కళ్యాణి చంద్రప్ప,కంద్రిగ ఉమా, బుచ్చినాయుడు కంద్రిగ సురేష్ నాయుడు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర కూలీలు పోలీస్ స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి

### పోలీస్ క్లియరెన్స్ ఉంటేనే ఫ్యాక్టరీలో చేర్చుకోవాలి-

### పూతలపట్టు,సీఐ తిమ్మయ్య.

**పూతలపట్టు, జూలై 26, జయ జయహే.**

అంతరాష్ట్ర వలస కూలీలు పూతలపట్టు పోలీస్ స్టేషన్లో పేర్లు నమోదు చేసుకోవాలని పోలీస్ క్లియరెన్స్ ఉంటేనే ఫ్యాక్టరీ యాజమాన్యం వారిని పనిలో పెట్టుకోవాలని లేదంటే సమస్యలు ఎదురైతే ఫ్యాక్టరీ యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని పూతల పట్టు సీఐ తిమ్మయ్య హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గంజాయి, మత్తు పదార్థాలు, మట్కా జూధాలు ,దోపిడీలు, ఇది టీచింగ్, మైనర్ బాలికలపై హత్యాయత్నాలు, అరికట్టడం కోసం చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడి ప్రత్యేక దృష్టి పెట్టారని అందులో భాగంగా చిత్తూరు డిఎస్పి వెంకటనారాయణ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పలుచోట్ల పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని సీఐ తెలిపారు. అంతర్రాష్ట్ర లైన రాజస్థాన్, అస్సాం, మహారాష్ట్ర ,ఉత్తర ప్రదేశ్ ,గుజరాత్, మధ్యప్రదేశ్, రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మందికి పైగా పూతలపట్టు మండలంలో వివిధ ఫ్యాక్టరీలు, హోటళ్ల లో పనిచేస్తూ ఇక్కడే కాపురాలు పెట్టినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల వలన ఏదైనా సమస్యలు ఎదురవుతుందని ముఖ్యంగా పూతలపట్టు మండలంలో పలు జ్యూస్ ఫ్యాక్టరీలు, చికెన్ ఫౌడర్ ఎస్పోర్టింగ్ కంపెనీ, ప్లాస్టిక్ గ్లాసులు కంపెనీ,లో హెవీ విద్యుత్ లైన్ పోల్స్, నాటే పని నిమిత్తం ఈ మండలంలోని స్థిరపడినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిని మండలంలోని ఫ్యాక్టరీ వాళ్లు ఎలాంటి ఆధారాలు తీసుకోకుండా ఫ్యాక్టరీ లలో చేర్చుకుంటున్నారని సమస్యలు ఎదురైతే ఫ్యాక్టరీ,హోటల్, యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు, పూతలపట్టు మండలంలో ఏడు మామిడి గుజ్జు పరిశ్రమ ఫ్యాక్టరీలు ,చికెన్ పౌడర్ ఫ్యాక్టరీ, ప్లాస్టిక్ గ్లాస్ , తయారి కంపెనీలు ఉన్నాయని పూతల పట్టు నుండి కొత్తకోట వరకు జాతీయ రహదారి పక్కన సుమారు పెద్దపెద్ద హోటల్ లో 50 వరకు ఉన్నాయన్నారు. వాళ్లు ఆ రాష్ట్రం నుంచి పోలీస్ స్టేషన్ క్లియరెన్స్ సర్టిఫికెట్, తెచ్చి ఇస్తేనే వారిని పనిలో చేర్చుకోవాలని లేదంటే చట్టపరంగా కంపెనీలు హోటల్ పై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పూతలపట్టు లోనే కాకుండా చుట్టుపక్కన గ్రామాలలో ఇల్లు అద్దెకి తీసుకుని



నివాసం ఉంటున్నారు. వాళ్ళు మాట్లాడే భాష మన తెలుగువారికి అర్థం కాకపోవడంతో ఏదో ఒక సమస్య సృష్టించి గుర్తుచెప్పుడు కాకుండా వెళ్లిపోతారని ఆయన తెలిపారు.ఇక్కడికి వచ్చిన వారంతా అధిక శాతం మంది చిన్న వయసు యువతి యువకులు మాత్రమేనని అందరూ చూడడానికి ఒకే రకంగా ఒకే పోలిక పొట్టిగా గుర్తుపట్టలేని విధంగా ఉన్నారని ఆయన అన్నారు. రెండు రోజుల క్రితం కొత్తకోట సమీపాన ఒక మామిడి ఫ్యాక్టరీలో ఉత్తరప్రదేశ్ కు చెందిన 30 మంది కూలీలు పనిచేస్తున్నారని అందులో ఒక యువకుడు 24వ తేదీ నుంచి కనిపించకపోవడంతో పూతలపట్టు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.గతంలో కూడా ఇలాంటి సంఘటనలో ఎన్నో జరిగాయని .స్థానికులు ఫ్యాక్టరీలలో చేరితే ఎక్కువ కూలీలు ఇవ్వవలసి ఉంటుందని ఫ్యాక్టరీ యాజమాన్యం తక్కువ డబ్బులు ఇచ్చి సుమారు 12 గంటల వరకు పనిచేసే కూలీలైన ఇతర రాష్ట్రాల వారిని నియమించుకోవడం జరిగిందని వివరించారు. అలా వారి అడ్రస్ తీసుకోకుండా పోలీస్ క్లియరెన్స్ లేకుండా చేర్చుకుంటే చట్టపరంగా ఆ కంపెనీల పై హోటల్ పై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరికలు జారీ చేశారు.



## వికృతమాల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న జనసేన నాయకుడు దండి నరేంద్ర

**శ్రీకాళహస్తి,జూలై 26,జయజయహే:**

తొలి ఏకాదశి పుణ్యదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి నియోజకవర్గం,ఏర్పేడు మండలం,వికృతమాల గ్రామంలో వెలసిన శ్రీ సంతాన సంపద వెంకటేశ్వర స్వామివారిని జనసేన పార్టీ నాయకుడు దండి నరేంద్ర దర్శించుకుని దివ్య ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన అభిషేకం,వేద పారాయణం,ఏకాంత సేవ వంటి విశిష్ట పూజల్లో ఆయన పాల్గొన్నారు.ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్,ఆలయ ఛైర్మన్ డాక్టర్ హరిప్రసాద్ పసుపులేటి కుటుంబ సభ్యులు,వేద పండితులు,గ్రామస్థులతో కలిసి స్వామివారిని దర్శించుకున్న దండి నరేంద్ర.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలు,రైతుల సంక్షేమం,ప్రజల సుభిక్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.వికృతమాలను "మినీ తిరుమల"గా తీర్చిదిద్దేందుకు కోనేరు నిర్మాణం సహా డాక్టర్ హరిప్రసాద్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కావలి మునికుమార్,పూల శివశంకర్,మురళి,శ్రీనివాస్, సుధాకర్, లోకేష్,జయశంకర్,దివాకర్,రాఘవ,రాజేష్‌తో పాటు పలువురు జనసైనికులు పాల్గొన్నారు.




## శ్రీకాళహస్తిలో కాంగ్రెస్ పార్టీ సంబరాలు

**శ్రీకాళహస్తి, జులై 26,జయ జయహే.**

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్య విజయమని శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డిపేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షులు బాలగురువం బాబు అధ్యక్షతన స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద బాణాసంచా కాల్చి మితాయిలు పంచుకొని సంబరాలు నిర్వహించారు.బాలగురవం బాబు మాట్లాడుతూ భారతదేశంలో ప్రజాస్వామ్య విలువలు అడుగింటి పోయాయని భావి భారతదేశ భవిష్యత్తు విద్యార్థులేనని అటువంటి విద్యార్థుల జీవితాలను అంధకారం చేస్తున్నటువంటి ప్రభుత్వాలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చెంపపెట్టువంటిదన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పోరాటాల పార్టీ అని కాంగ్రెస్ పార్టీ పోరాటం వల్లే భారతదేశానికి స్వాతంత్రం లభించిందని నాటి పోరాట స్ఫూర్తిని నేటి విద్యార్థులు అవలంబించడం వల్లే నేడు విద్యార్థి లోకానికి న్యాయం జరిగిందన్నారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, జిల్లా అధికార ప్రతినిధి శ్రీను గౌడ్, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, శ్రీకాళహస్తి మండల యువజన అధ్యక్షులు యానాది నవీన్, సూళ్లూరుపేట నియోజకవర్గ నాయకులు కిరణ్, శ్వేత,విజయ్,రమేష్,నాగూరయ్య,సుధా యాదవ్, ప్రసాద్,దిలీప్, నిజాముద్దీన్,నాగరాజు, మహేష్,అరుణ్,చరణ్, జోసెఫ్,సారధి తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి ప్రతిభావంతురాలికి బలిజ చేయూత ఫౌండేషన్ ఆర్థిక సాయం

**నాయుడుపేట,జూలై 26,జయ జయహే:**



ఉమ్మడి నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట మండలం రాజగోపాలపురానికి చెందిన సొట్ట సుబ్రమణ్యం కుమార్తె హస్మిత పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన సందర్భంగా బలిజ చేయూత ఫౌండేషన్ గౌరవ సభ్యులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరంజీవి హస్మిత ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యా ఫీజు నిమిత్తం రూ.8,000 ఆర్థిక సాయాన్ని ఆమె నివాసంలో అందజేశారు.ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గం ఎగ్జిక్యూటివ్ సభ్యులు పగడాల ప్రదీప్,హంస పృథ్వీచంద్,నీలం హరికృష్ణ,బారు హరి,వక్కలక్కుల సునీతమ్మ తదితరులు పాల్గొని విద్యార్థినికి ఆర్థిక సాయాన్ని అందజేసి భావిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.



## ఎయిర్ పోర్టు ప్రారంభ సభకు జనసమీకరణ

### ఎమ్మెల్యే పులివర్తి నాని

**భీమిలి, జులై 26, జయ జయహే :**

భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి భీమిలి నియోజకవర్గం నుంచి భారీ జనసమీకరణ చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అన్నారు. భీమిలి టీడీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ శ్రేణుల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి గ్రోత్ ఇంజన్ భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం గడువులోగా పూర్తి చేయడం వెనుక ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ విశేష కృషి ఉందని తెలిపారు. ఆగస్టు 1 వ తేదీన ప్రతిష్టాత్మకంగా జరగనున్న ఎయిర్ పోర్టు ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలకాలన్నారు. అధ్యక్షత వహించిన భీమిలి పార్టీ ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు మాట్లాడుతూ భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాల సహా 9 జీవీఎంసీ వార్డుల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తల సమీకరణ, వారికి కల్పించాల్సిన సౌకర్యాల గురించి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇచ్చిన సూచనలను వివరించారు. పరిశీలకుడు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి భాగస్వామ్యం కల్పించడం ద్వారా ఎక్కువమందిని సమీకరించగలుతామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు, బిజెపి కన్వీనర్ కైలాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముక్కంటిని దర్శించుకున్న కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు

**శ్రీకాళహస్తి, జులై 26,జయ జయహే.**



మాజీ మంత్రి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస రావు ఆదివారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. ముందుగా అయన కుటుంబ సభ్యులతో కలసి ఆలయం లో రాహు కేతు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.దర్శనానంతరం వేదఆశీర్వచనం పొందారు.ఆలయ అధికారులు,బీజేపీ నాయకులు వారికి స్వామిబిఅమ్మవార్ల చిత్రపఠం, తీర్థప్రసాదాలు అందజేశారు.



## ఎస్.ఐ.ఆర్ అవగాహన సదస్సు విజయం కోసం భాజపా మండల సమావేశాలు

**రేణిగుంట,జూలై 26,జయజయహే:**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ సూచనలతో శాసనసభ ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్.ఐ.ఆర్ అవగాహన సదస్సు విజయం కోసం ముందస్తు మండల సమావేశాలు నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా ఆదివారం ఉదయం రేణిగుంట మండల ప్రధాన కార్యదర్శి సొంగ పురుషోత్తం నివాసంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ,జిల్లా ఉపాధ్యక్షుడు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి,మండల అధ్యక్షుడు పూజారి ప్రేమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 31న శ్రీకాళహస్తిలోని ఎన్.వి.ఎస్ కళ్యాణ మండపంలో జరిగే పోలింగ్ కేంద్ర స్థాయి ప్రతినిధుల అవగాహన సదస్సును విజయవంతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం రేణిగుంట,శ్రీకాళహస్తి ప్రాంతాల్లోని కార్యకర్తల ఇళ్లపై పార్టీ జెండాలను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కండ్రిగ యతీంద్ర రెడ్డి,ప్రధాన కార్యదర్శులు వలపల రాజేంద్ర నాయుడు,సొంగ పురుషోత్తం,ఉపాధ్యక్షులు చింత రాజా రాయల్,రమేష్,పట్టణ అధ్యక్షుడు భీమవరం నరేష్,యువమోర్చా అధ్యక్షుడు బొమ్మి శ్రీకాంత్,జనంకోసం వేణు,ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కేశవులు,ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్,అశోక్ సహా పలువురు పాల్గొన్నారు



## గిరిజనులకు న్యాయం చేయాలి

### ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**సత్యవేడు,జూలై 26,జయజయహే:**

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాలెం మండలం మాదిరికుప్పం రెవెన్యూ పరిధిలో ఎంతో కాలంగా భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బి.కె.ఎం.యు) డిమాండ్ చేసింది.ఆదివారం వి.కె.ఆర్.వై గిరిజన కాలనీలో జరిగిన సంఘ శాఖ సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షుడు అంబాకం చిన్నిరాజు మాట్లాడారు.సుమారు 40 ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులను సాగు చేయకూడదని రెవెన్యూ అధికారులు ఆక్షేపించడం దుర్మార్గమని విమర్శించారు.పాదరకుప్పం రెవెన్యూలోని 1165 ఎకరాల చోత్రియ భూములు ప్రభుత్వానికే చెందుతాయని ఇటీవల సంయుక్త కలెక్టర్ తీర్పు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.ఆ భూములకు సమీపంలో పరిశ్రమలు ఉన్నాయనే సాకుతో గిరిజనులను సాగు చేయనివ్వకుండా అడ్డుకుంటున్నఅధికారులు,స్థానికేతరులు,ధనవంతులు అక్రమంగా భవంతులు,దుకాణాలు నిర్మిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.అధికారులకు అర్జీలు ఇచ్చినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అందరిలాగే గిరిజనులు కూడా భూములను సాగు చేసుకునేలా జిల్లా కలెక్టర్ అనుమతించాలని,లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తిరుపతి జిల్లా కోశాధికారి ధనుంజయ శెట్టి,నాయకులు రవినాయుడు,ధనంజయలు,వెలుగొండ,చెల్లమ్మ,చెంచయ్య,మారయ్య,శైలజ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీని సందర్శించిన ప్రముఖ బిజినెస్ ప్రతినిధుల బృందం

### శ్రీసిటీ పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక మౌళిక సదుపాయాలపై ప్రశంసలు

**శ్రీసిటీ, జూలై 26, జయ జయహే.**

దేశంలోని ప్రముఖ వ్యాపార కుటుంబాలు, ఫ్యామిలీ ఆఫీసులకు చెందిన 10 మంది ప్రతినిధులతో కూడిన బృందం శ్రీసిటీని సందర్శించింది. ఫ్యామిలీ పెట్టుబడుల ప్రోత్సాహక సంస్థ ఐక్యా కనెక్ట్ ఆధ్వర్యంలో ఈ పర్యటన జరిగింది . ప్రస్తుతం ఐక్యా కనెక్ట్‌కు 6 దేశాలు, 16 నగరాల నుంచి 85 సింగిల్ ఫ్యామిలీ ఆఫీసులు అనుబంధంగా ఉండగా, ఇవి కలిపి 30 బిలియన్ డాలర్లకు పైగా కుటుంబ పెట్టుబడులను నిర్వహిస్తున్నాయి. ఈ ప్రతినిధి బృందానికి అట్లాస్ ఫ్యామిలీ ఆఫీస్ చైర్మన్ మెహతాస్ హాస్పిటల్స్ చైర్మన్ డా. సమీర్ మెహతా నాయకత్వం వహించారు. వారి పర్యటనలో భాగంగా శ్రీసిటీలోని ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలను పరిశీలించడంతో పాటు బి ఎఫ్ జి, అల్‌స్టామ్, టి హెచ్ కె, పానాసోనిక్ వంటి ప్రముఖ పరిశ్రమలను సందర్శించి వాటి తయారీ కార్యకలాపాలను పరిశీలించింది. శ్రీసిటీ పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక వాతావరణంపై సమగ్ర పరిశీలన చేశారు.ఈ సందర్భంగా డా. సమీర్ మెహతా తమ పర్యటనకు సహకరించిన శ్రీసిటీ








మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసిటీ ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలు, పెట్టుబడి అనుకూల పారిశ్రామిక వాతావరణం తమను ఎంతో ఆకట్టుకుందని అన్నారు. ఐక్యా కనెక్ట్ వ్యవస్థాపకుడు, చైర్మన్, దినేష్ హిందూజా ఫ్యామిలీ ఆఫీస్ హెడ్ జై రూపానీ మాట్లాడుతూ, దూరదృష్టితో కూడిన ప్రణాళిక, సుస్థిర అభివృద్ధికి నిలయమైన శ్రీసిటీ ఎంతో ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. భారతదేశంలో సమగ్ర పారిశ్రామిక అభివృద్ధికి ఒక ప్రమాణంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ పర్యటన ద్వారా ఫ్యామిలీ ఆఫీసుల పెట్టుబడిదారులు శ్రీసిటీ సామర్థ్యాన్ని ప్రత్యక్షంగా అంచనా వేసే అవకాశం లభించిందని తెలిపారు.

# సర్జరీ వల్ల కార్యక్రమాలకు దూరంగా ఎమ్మెల్యే గంటా



**విశాఖపట్నం, జులై 26, జయ జయహే**

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎడమ కాలి వేలికి చిన్నపాటి సర్జరీ జరిగింది. డాక్టర్లు విశ్రాంతి తీసుకోవాలని సూచించడంతో ఆదివారం ఆయన పూర్తిగా ఇంటికే పరిమితం కావలసి వచ్చింది. భీమిలి పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన భోగాపురం ఎయిర్ పోర్టు జనసమీకరణ సన్నాహక సమావేశం సహా స్థానికంగా ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాలకు హాజరు కాలేకపోయారు సర్జరీ వల్ల కనీసం 3-4 రోజుల విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సలహా ఇచ్చారు. ఎంవీపీ కాలనీలోని నివాసంలో గంటాను మంత్రి బీసీ జనార్ధనరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య కలిశారు.



# యూపీలో పొత్తుకు సిద్ధం..

## అఖిలేశ్‌కు అసదుద్దీన్ ఓవైసీ ఓపెన్ ఆఫర్

## యూపీలో బీజేపీని ఓడించేందుకు ఎస్పీతో పొత్తుకు సిద్ధమన్న అసదుద్దీన్ ఓవైసీ

**న్యూఢిల్లీ, జయ జయహే**

దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో మరోసారి రాజకీయ సమీకరణాలు వేడెక్కుతున్నాయి. 2027లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్‌కు పొత్తు కోసం బహిరంగ ఆహ్వానం పంపారు. బీజేపీని మరోసారి అధికారంలోకి రాకుండా నిలువరించేందుకు కలిసి పనిచేయడానికి ఇదే సరైన సమయమని ఆయన స్పష్టం చేశారు.

మొరాదాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఓవైసీ మాట్లాడుతూ.. "ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడాన్ని మజ్లిస్ కోరుకోవడం లేదు. అందుకే నేను చేతులు కలపడానికి, పొత్తు పెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. మాట్లాడటానికి ఇదే సరైన సమయం. ఎన్నికలు ముగిశాక తర్వాత ఏడవద్దు" అంటూ అఖిలేశ్ యాదవ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తమ పార్టీ పోటీ చేయడం వల్ల ఎస్పీకి నష్టం జరుగుతుందనే వాదనను ప్రస్తావిస్తూ, ఆ నష్టం జరగకుండా ఉండేందుకే తాను పొత్తుకు సిద్ధంగా ఉన్నానని వివరించారు.

అయితే, ఈ పొత్తులో తమకు సమాన గౌరవం, హక్కులు కావాలని ఓవైసీ స్పష్టమైన సంకేతాలిచ్చారు. "మా పోరాటం ఏ మతానికి వ్యతిరేకం కాదు. మా గౌరవం, న్యాయం కోసమే ఈ పోరాటం. అఖిలేశ్ యాదవ్ కుర్చీలో కూర్చుంటే, నేను కూడా ఆయన ముందు సమానంగా కూర్చుని హక్కులు, న్యాయం గురించి చర్చిస్తాను" అని ఆయన పేర్కొన్నారు.

ఓవైసీ పొత్తు ప్రతిపాదనపై బీజేపీ వెంటనే స్పందించింది. ఇది బుజ్జగింపు రాజకీయాల కలయిక అని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు. "అఖిలేశ్, ఓవైసీ ఇద్దరూ బుజ్జగింపు రాజకీయాల్లో ఒకరితో ఒకరు పోటీ పడతారు. ఇప్పుడు 'పెద్ద భాయిజాన్ ఎవరు' అనే పోటీని పక్కనపెట్టి 'భాయిజాన్ కలయిక' కోసం చూస్తున్నారు. అందుకే ఓవైసీ, అఖిలేశ్‌కు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్నారు" అని ఆయన ఎద్దేవా చేశారు.


కాగా, యూపీలో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షంగా సమాజ్‌వాదీ పార్టీ ఉంది. 2027 ఎన్నికలను పార్లమెంట్ ఎన్నికలకు సెమీ ఫైనల్‌గా భావిస్తున్న తరుణంలో ఓవైసీ ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ ఆఫర్‌పై అఖిలేశ్ యాదవ్ నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు.

# 2కే రన్‌లో ఆద్య అద్భుత ప్రతిభ...!

**విశాఖపట్నం, జూలై 26, జయ జయహే :**



ఎండాడలో 'ఎండాడ అథ్లెటిక్ అసోసియేషన్' మరియు 'వైజాగ్ అథ్లెటిక్ అసోసియేషన్' సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 2కే రన్ లో విశాఖ వ్యాలీ స్కూల్ లో 4వ తరగతి విద్యార్థి "ఆద్య" విజయవంతంగా పరుగును పూర్తి చేసి క్రీడా స్ఫూర్తిని చాటింది. ఈ క్రీడా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, గౌరవ అతిథులుగా విచ్చేసిన వైజాగ్ అథ్లెటిక్స్ అధ్యక్షులు నాగేశ్వర రావు, టౌన్ ప్లానింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, జీవీఎంసీ డిప్యూటీ సిటీ ప్లానర్ కే. వెంకటేశ్వర రావు, వైజాగ్ అథ్లెటిక్స్ కార్యదర్శి ఎం. నారాయణ రావు తదితరులు చిన్నారి ఆద్యను ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆశీర్వదించారు. చిన్న వయసులోనే పట్టుదలతో 2కే రన్ పూర్తి చేసిన ఆద్యకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.




# రోటరీ క్లబ్ మహిళల వైద్య శిబిరానికి విశేష స్పందన

**విశాఖపట్నం, జూలై 26, జయ జయహే**

రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో ఆదివారం వి హెల్త్ కేర్ లో జరిగిన మహిళల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 200 మంది మహిళలకు వివిధ వైద్య పరీక్షల నిర్వహించి తగు వైద్య సలహాలు అందజేశారు. బిపి, షుగర్, ఈసీజీ పరీక్షలను ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సిహెచ్ కామేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం కుటుంబం ఆరోగ్యం పై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. శిబిరంలో వైద్య సేవలు అందజేసిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ వి. బి. టి. సుందరి, చర్మ వ్యాధి నిపుణురాలు డాక్టర్ వి వసుధలను అభినందించారు. 40 సంవత్సరాలు పైబడిన మహిళలు క్రమ తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా చిన్నపాటి ఆరోగ్య సమస్యలను వెంటనే గుర్తించి తగు చికిత్సలను పొందవచ్చు అని స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ సుందరి పేర్కొన్నారు. గర్భాశయ క్యాన్సర్ పై మహిళలకు ఆమె అవగాహన కల్పించారు. చర్మవ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చర్మవ్యాధులు నుండి రక్షణ పొందవచ్చు అని డెర్మటాలజిస్ట్ డాక్టర్ వసుధ పేర్కొన్నారు. రోటరీ క్లబ్ కమ్యూనిటీ సర్వీసెస్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ దేవరకొండ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్. కృష్ణకుమారి వైద్య శిబిరంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ కె.ఎం.కె. రమేష్, రొటేరియర్లు బి.శంకర్, బి. భాస్కర్, జి.వెంకట్రావు, వి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తరాంధ్రకు మైలురాయి భోగాపురం విమానాశ్రయం

**చోడవరం,జూలై 26 జయ జయహే**

ఉత్తరాంధ్రకే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక తల మాణిక్యమని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు అన్నారు. ఆదివారం చోడవరం పార్టీ కార్యాలయంలో ఆగస్టు 1న జరగనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ సభ విజయవంతానికి సంబంధించిన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆగస్టు 1న జరిగే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ సభకు చోడవరం నియోజకవర్గం నుండి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు . అలాగే ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు , ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని సభ ఏర్పాట్లపై చర్చించారు.

# ఘనంగా అగ్నిగుండ మహోత్సవం

**శ్రీకాళహస్తి, జులై 26,జయ జయహే**

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం అనుబంధాలయమైన శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామి వారి బ్రహ్మోత్సవాలు పదవ రోజు రాత్రి అగ్నిగుండము ప్రవేశంమహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద భక్తులు పొంగళ్ళు పొంగించారు. 11 గంటలకు పూర్ణహుతి సమర్పించి అగ్నిగుండ ము ప్రారంభించారు. భక్తులు కంకణాదారులై సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం చేశారు. డిఎస్పీ నరసింహామూర్తి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తూ ఏర్పాటు చేశారు. చైర్మన్ సాయి ప్రసాద్,ఈఓ, ఆలయ అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.








# ఉన్నత విద్యావంతుడికే కేంద్ర విద్యా శాఖ ఇవ్వాలి

## కాంగ్రెస్ నేత ప్రియాంక దండి పిలుపు

**విశాఖపట్నం, జూలై 26, జయ జయహే :**

కేంద్ర విద్యా శాఖ మంత్రిగా ఉన్నత విద్యావంతుడికే ఆ బాధ్యతలు అప్పగించాలని కాంగ్రెస్ నేత ప్రియాంక దండి కోరారు. ఢిల్లీలో గత నెల రోజులుగా విద్యార్థులు చేస్తున్న పోరాటానికి స్పందిస్తూ నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో దేశంలో యువత సంబరాలు జరుపుకున్నారని, అందులో భాగంగా ఆదివారం విశాఖ యువత జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రియాంక దండి పాల్గొని మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి రాజీనామాతో సమస్య పరిస్కారం కాలేదని, ఆయన స్థానంలో ఉన్నత విద్యావంతుడు, ఎలాంటి అవినీతి ఆరోపణలులేని వ్యక్తిని కేంద్ర విద్యా శాఖ మంత్రిగా నియమించాలని, ఉన్నత స్థాయి జేపీసీ కమిటీ నియమించి విద్యార్థులతో చర్చించి వారి ఆలోచనలకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని,దేశంలో అత్యున్నత స్థాయి పరీక్షలు నిర్వహించే నీట్ ని రద్దు చేసి యూ పి ఎస్ సి పరీక్షల నిర్వహణ వ్యవస్థ తరహాలో నీట్, నెట్ మరియు ప్రతిష్టత్మక పరీక్షల నిర్వహణకు స్వాతంత్ర ప్రతి పత్తి కలిగిన బాడీ నియమించాలని ప్రియాంక డిమాండ్ చేసారు. కేంద్ర ప్రభుత్వం పై పోరాటం కొనసాగుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వివిధ విద్యా సంస్థల విద్యార్థులు మాధవి, ప్రశాంత్, రేష్మ, వంశీ,కాసాఫా, డా విజయ్, యువత కార్తీక్, బొట్టా రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



# కళాభారతిలో వైభవంగా బుర్ర కథ ఉత్సవాలు

**విశాఖపట్నం, జూలై 26, జయ జయహే**

విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల హరికథ బుర్రకథ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆఖరి రోజు కార్యక్రమానికి కళాభారతి కార్యదర్శి హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ జోనల్ కోఆర్డినేటర్ శ్రీరామదాస డాక్టర్ రాంబాబు , ఎస్ రామగోపాల్ , డాక్టర్ ఇందిరా , ఎంఆర్కే రావు , నర్సింగరావు జ్యోతి ప్రజ్వలనతో శుభారంభం చేశారు. జగన్నాధుని చరిత్ర బుర్రకథ రూపంలో అద్భుతంగా శ్రావ్యమైన సంగీతం కంఠంతో, హాస్యంతో, కథతో చెప్పి హాలు నిండిన శ్రోతలు మహదానందంతో చప్పట్లతో హాలు మారుమ్రోగింది. కార్యదరి శ్రీరామదాస డా. రాంబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా వార్షిక జాతీయ పురస్కారం మరియు 6 రోజుల సంగీత, నృత్య, పౌరాణిక నాటక ఉత్సవాలు ఆగస్టు 22 నుంచి 27 వరకు ఉంటాయని, కళాభారతి స్థాపించి 40 సంవత్సరాలు నిండిన సందర్భంగా అన్ని కార్యక్రమాలు అత్యున్నత స్థాయి కళాకారులవి ఏర్పాటు చేశామని వీక్షకులు ముందుగానే తేదీలు బ్లాక్ చేసుకుని అందరూ రావాలని కోరారు.

# నేడు జిల్లాలో రంగవల్లి పోటీలు

## ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు కేంపెయినింగ్

## కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

**విశాఖపట్నం జూలై 26, జయ జయహే**

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు అనే కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం జిల్లాలో ఈ నెల 27న ఉదయం 10 గంటలు నుండి రంగవల్లి పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామంలో, మండల కేంద్రాలలో, జివిఎంసి పరిధిలోని 9 జోన్ లలో సేర్ప్, యుసిడి ఆధ్వర్యంలో రంగవల్లి పోటీలు జరుగుతాయని తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడం వలన ఉత్తరాంధ్రలో పారిశ్రామిక ప్రగతి యువతకు ఉపాధి అవకాశాలు,



పర్యాటక రంగం పురోగతి ప్రజలలో అవగాహన కల్పించడమే ఈ పోటీల ఉద్దేశ్యమని కలక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొనాలని కలక్టర్ కోరారు. భీమిలి నియోజకవర్గంలో జోన్-1 కార్యాలయంలో, మధురవాడ జోన్ లో చంద్రపాలెం జిల్లా పరిషత హైస్కూల్ లో, విశాఖ తూర్పు నియోజకవర్గంలో ఆశీల్ మెట్ట జోన్ 3 కార్యాలయంలో, దక్షిణ నియోజకవర్గంలో ప్రసాద్ గార్డెన్స్ లో ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, ఉత్తర నియోజకవర్గంల్ రేసవానిపాలెం స్వర్ణ భారతి స్టేడియంలో, పశ్చిమ నియోజకవర్గంలో జోనల్ కార్యాలయం వద్ద, గాజువాక నియోజకవర్గంలో గాజువాక జోనల్ కార్యాలయంలో, పెందుర్తి నియోజకవర్గంలో వేపగుంటలో జోనల్ కార్యాలయంలో, అగనంపూడి జోనల్ కార్యాలయంలో రంగవల్లి పోటీలు జరుగుతాయని మునిసిపల్ అధికారులు తెలిపారు.

For a pure tomorrow.. జయహే



### పాలకూర రసం తాగితే

# అందం, ఆరోగ్యం రెండూ మీ సొంతం

ఆకు కూరల్లో పాలకూర కూడా ఒకటి. పాలకూర ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో శరీరానికి కావాల్సిన ఎన్నో రకాల పోషకాలు లభిస్తాయి. ఎక్కువగా విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. పాలకూర మాత్రమే కాకుండా వీటి రసం తాగడం వల్ల కూడా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పాలకూర రసం తాగడం వల్ల ముఖ్యంగా కళ్ల ఆరోగ్యం మెరుగు పడుతుంది. ఇందులో ఉండే విటమిన్ ఏ, గ్లాకోమా కంటి సమస్యలను నివారించి.. కంటి చూపును మెరుగు పరుస్తాయి. దృష్టి లోపాలు లేకుండా చేస్తాయి. రక్త హీనత సమస్యను నివారించడానికి కూడా సహాయ పడుతుంది. పాలకూర రసం తాగితే శరీరంలో రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. సీజనల్ వ్యాధులతో పోరాడే శక్తిని అందిస్తుంది. వైరస్, బ్యాక్టీరియాలు ఎటాక్ చేయకుండా చూస్తుంది. అంతే కాకుండా గుండె సంబంధిత వ్యాధులు ఎటాక్ చేయకుండా.. గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది.

పాలకూర రసం తాగడం వల్ల చర్మ, జుట్టు ఆరోగ్యం కూడా మెరుగు పడుతుంది. వృద్ధాప్య ఛాయలు త్వరగా ఎటాక్ చేయకుండా.. ముడతలు రాకుండా ముఖాన్ని కాంతివంతంగా చేస్తుంది. అలాగే జుట్టు రాలకుండా, బలంగా, దృఢంగా ఉండేలా చేస్తుంది.

పాలకూరలో పవర్ ఫుల్ యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించడానికి ఎంతో హెల్ప్ చేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పాలకూర రసం తాగడం వల్ల బరువు కూడా అదుపులో ఉంటుంది.



# కాళ్లూ చేతులూ మెరిసేలా..

శరీర సౌందర్యంలో ముఖంతోపాటు కాళ్లూ, చేతులదీ కీలకపాత్రే. అమ్మాయి అందానికి అదనపు ఆకర్షణగా నిలిచే వీటిమీద చాలామంది సరైన శ్రద్ధ పెట్టరు. దానితోపాటు హార్మోన్ల ప్రభావం, చర్మ సమస్యలు, ఎండలో తిరగడంలాంటి వాటివల్ల ఈ ప్రాంతాల్లో మచ్చలు ఏర్పడుతుంటాయి. ఇవిపోయి మెరిసే చర్మం సొంతం కావాలంటే కొన్ని చిట్కాలు పాటిస్తే సరి!

**ఓట్స్- పెరుగు**

ఒక టీ స్పూన్ ఓట్స్‌ను మిక్సీలో వేసి పొడిగా చేసుకోవాలి. దానిలో పెరుగు కలపాలి. ఈ మిశ్రమాన్ని కాళ్లూ చేతులపై రాసి ఆరనివ్వాలి. తర్వాత చల్లటి నీళ్లతో శుభ్రంగా కడిగేయాలి. ఇలాచేస్తే చర్మంపై ఏర్పడిన మచ్చలు నెమ్మదిగా తగ్గుముఖం పడతాయి.

**టమాటా స్క్రబ్..**

ఒక టమాటా తీసుకుని మధ్యలో కోయాలి. దానిమీద చక్కెర చల్లి మచ్చలు ఉన్న ప్రదేశంలో స్క్రబ్ చేసుకోవాలి. లేదా టమాటాను మెత్తగా చేసి ఆ ప్రాంతంలో రాసినా ఫలితం ఉంటుంది. క్రమం తప్పకుండా దీన్ని ప్రయత్నిస్తే మచ్చలు మాయమవుతాయి.

**శనగపిండి**

రెండు స్పూన్ల శనగపిండిలో కొద్దిగా నీళ్లు కలిపి పేస్టులా చేయాలి. ఈ పిండిని కాళ్లు, చేతులకు రాసి కాసేపు వదిలేయాలి. ఆరిన తర్వాత కొద్దికొద్దిగా నీళ్లు చల్లుతూ స్క్రబ్ చేయాలి. వారానికి కనీసం మూడుసార్లు ఇలా చేస్తే సమస్య తగ్గుముఖం పడుతుంది.

## అదనపు రుణానికి రూట్..

# టాపప్ హోమ్ లోన్



**వేగంగా, డిజిటల్‌గా మంజూరు**
**ఎలాంటి పత్రాలు అవసరం లేదు**
**వడ్డీ రేటు ఇతర రుణాల కంటే తక్కువ**
**అన్నీ ఆలోచించాకే నిర్ణయం**
**ముఖ్య అవసరాలకే పరిమితం కావాలి**

**సొంతిల్లు..**

చాలా మంది జీవిత లక్ష్యాల్లో ఒకటి. రుణంపై సొంతిల్లు సమకూర్చుకునే వారే ఎక్కువగా ఉంటున్నారు. అలా గృహ రుణం తీసుకున్న తర్వాతి కాలంలో ఎదురయ్యే అవసరాల కోసం అదనపు రుణం తీసుకునే అవకాశం ఉంటే..? గృహ నవీకరణ లేదా విద్యా సంబంధిత ఫీజుల చెల్లింపు లేదా అనారోగ్యం.. అవసరం ఏదైనా గృహ రుణంపై టాపప్ రుణం సులభంగా లభిస్తుంది.

కాకపోతే ఈ విధంగా తీసుకుంటున్న రుణం ఏ అవసరాలకు వినియోగిస్తున్నారనేది ఇంత వరకు బ్యాంక్‌లు పెద్దగా పట్టించుకునేవి కావు. కానీ, ఇటీవలే ఆర్‌బీఐ ఈ విషయమై బ్యాంక్‌లను హెచ్చరించింది. కనుక టాపప్ హోమ్‌లోన్‌ను ఏ అవసరం కోసం తీసుకుంటున్నామనేది రుణ గ్రహీతలు సైతం ఒక్కసారి పరిశీలన చేసుకోవాల్సిందే. చౌకగా లభించే ఈ రుణాన్ని ముఖ్యమైన అవసరాల్లో వినియోగించుకోవడం ద్వారా తగినంత ప్రయోజనం పొందొచ్చు.

**టాపప్ అంటే...**

అప్పటికే తీసుకున్న గృహ రుణంపై అదనపు రుణాన్ని తీసుకోవడమే టాపప్ హోమ్‌లోన్ అవుతుంది. దాదాపు అన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ తరహా రుణాలను ఆఫర్ చేస్తుంటాయి. ఇంటి విలువ ఎంత? ఇంటికి తీసుకున్న రుణానికి చెల్లింపులు ఏ విధంగా చేస్తున్నారు? అప్పటి వరకు ఎంత మేర చెల్లించారు? తదితర అంశాల ఆధారంగా ఈ రుణానికి అర్హత లభిస్తుంది. ఇది సెక్యూర్డ్ లోన్ కిందకే వస్తుంది. కనుక బ్యాంక్‌లకు వీటిపై రిస్క్ తక్కువే. అయితే రుణ గ్రహీత చెల్లింపుల సామర్థ్యాన్ని బేరీజు వేసుకున్న తర్వాతే ఈ రుణంపై బ్యాంకింగ్ నిర్ణయం తీసుకుంటుంది.

**ఎలా పనిచేస్తాయి?**

"గృహ రుణం తీసుకున్న తర్వాత క్రమం తప్పకుండా ఈఎంఐ చెల్లిస్తూ.. 18-24 నెలలు గడిచిన తర్వాత టాపప్ లోన్ తీసుకునేందుకు అర్హత లభిస్తుంది" అని విష్ఫిన్ సీఈవో రిషి మెహ్రా తెలిపారు. వాస్తవంగా జారీ అయిన గృహ రుణం నుంచి అప్పటికి మిగిలి ఉన్న రుణ బకాయి పోను మిగిలిన మొత్తం టాపప్‌గా లభిస్తుంది. అంటే అప్పటి వరకు తీర్చిన రుణం మొత్తమే తిరిగి రుణంగా తీసుకోవచ్చు.

ఉదాహరణకు రూ.కోటి విలువ చేసే ఇంటి కోసం గరిష్ట పరిమితి మేరకు రూ.80 లక్షల రుణం తీసుకున్నారని అనుకుందాం. తర్వాత ఐదేళ్లలో రూ.10లక్షలు అసలు తీర్చివేసినట్టయితే.. అప్పుడు తిరిగి రూ.10 లక్షల మేర టాపప్ హోమ్‌లోన్‌కు అర్హత ఉంటుంది. అంతేకాదు ఈ ఐదేళ్లలో పెరిగిన ఇంటి విలువను సైతం బ్యాంక్‌లు పరిగణనలోకి తీసుకుంటాయి.

రూ.కోటి విలువ చేసే ఇంటి విలువ ఐదేళ్లలో రూ.1.20 లక్షలకు చేరిందనుకుంటే అప్పుడు రుణ అర్హత రూ.96లక్షలకు పెరుగుతుంది. ఈ రుణ కాల వ్యవధి కూడా, గృహ రుణం కాలానికి మించకుండా ఉంటుంది. చాలా బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు టాపప్ హోమ్‌లోన్‌ను 15 ఏళ్ల కాలవ్యవధి వరకు ఆఫర్ చేస్తున్నట్టు పైసాబజార్ హోమ్ లోన్స్ హెడ్ రతన్ చౌదరి తెలిపారు. గృహ రుణం కాల వ్యవధి ఇంకా ఏడేళ్లు, అంతకు మించి ఉంటే.. ఇతర రుణాల కంటే తక్కువ ఈఎంఐకే రుణం పొందొచ్చని చౌదరి సూచించారు.

**సులభతరం**

టాపప్ హోమ్‌లోన్‌ను చాలా సంస్థలు డిజిటల్‌గా మంజూరు చేస్తున్నాయి. కనుక వేగంగా రుణం చేతికి అందుతుంది. అప్పటికే గృహ రుణం కోసం అన్ని పత్రాలు సమర్పించి ఉంటారు కనుక.. అదనంగా ఎలాంటి డాక్యుమెంట్ల అవసరం ఏర్పడదు. అన్ని పత్రాలు దగ్గర ఉండడంతో బ్యాంక్‌లు వేగంగా నిర్ణయం తీసుకుంటాయి. రుణ గ్రహీత తాజా క్రెడిట్ రిపోర్ట్‌ను తప్పకుండా పరిశీలిస్తాయి.

**చౌక ఆప్షన్**

అన్ని రుణాల్లోకి గృహ రుణం చౌక వడ్డీ రేటుకే లభిస్తుంది. గృహ రుణంపై ప్రస్తుతం అమల్లో ఉన్న వడ్డీ రేటే.. టాపప్‌కి సైతం అమలవుతుంది. పర్సనల్ లోన్, క్రెడిట్‌కార్డుపై రుణం, బంగారంపై రుణం కంటే టాపప్ హోమ్‌లోన్ చౌక అని పైసాబజార్ రతన్ చౌదరి తెలిపారు. ఒకవేళ అప్పటికే క్రెడిట్ కార్డ్‌పై రుణం లేదా వ్యక్తిగత రుణం తీసుకుని, అధిక వడ్డీ రేటు చెల్లిస్తుంటే.. అటువంటి వారు సైతం టాపప్ హోమ్‌లోన్ తీసుకుని వాటిని తీర్చివేయడం ద్వారా భారాన్ని తగ్గించుకోవచ్చు. పర్సనల్, క్రెడిట్ కార్డు రుణాలు అన్ సెక్యూర్డ్ కిందకు వస్తాయి. అందుకే వాటిపై వడ్డీ రేటు ఎక్కువ. గృహ రుణం సెక్యూర్డ్ (ఇల్లు తనఖాపై) కనుక వడ్డీ రేటు తక్కువ.

**అవసరం మేరకే..**

సులభంగా, చౌకగా వస్తుందని చెప్పి టాపప్ హోమ్‌లోన్‌కు మొగ్గు చూపించే ముందు, అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలన చేయడం ఎంతో అవసరం. టాపప్ రుణాలతో వచ్చే పెద్ద సమస్య నెలవారీ చెల్లించాల్సిన ఈఎంఐ పెరిగిపోవడమేనని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ (ఆర్‌ఐఏ), సహజ్ మనీ వ్యవస్థాపకులు అభిషేక్ కుమార్ తెలిపారు.

టాపప్ హోమ్ రుణాలు అనుత్పాదక అవసరాలకు వినియోగం అవుతుండడంపై ఆర్‌బీఐ ఇటీవలే బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలను అప్రమత్తం చేసింది. ఈ రుణాలు తీసుకున్న వారు దేనికి వినియోగిస్తున్నారో తెలుసుకోవాలని కోరింది. ముఖ్యంగా ఈ తరహా రుణాలు ఇటీవలి కాలంలో గణనీయంగా పెరిగిపోయాయి. లోన్-టు-వేల్యూ రేషియో (ప్రాపర్టీ విలువపై జారీ చేసే రుణం మొత్తం/ఎల్‌టీవీ), రిస్క్‌లు, రుణ నిధుల వినియోగంపై ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. కనుక ఈ తరహా రుణాలు స్పెక్యులేటివ్ అవసరాలకు తీసుకోవడం లేదని బ్యాంక్/ఎన్‌బీఎఫ్‌సీని నమ్మించాల్సి రావచ్చు.

ఇలా తీసుకున్న నిధులను ట్రేడింగ్‌లో నష్టపోయి, తిరిగి చెల్లింపులు చేయలేకపోతే అప్పుడు రుణం ఇచ్చిన బ్యాంక్ ఇంటిని జప్తు చేస్తుందన్నది మర్చిపోవద్దు. "టాపప్ హోమ్ లోన్స్ అన్నవి సాధారణంగా గృహ నవీకరణ కోసమే. పిల్లల విద్య లేదా వైద్య వ్యయాలు వంటి ఇతర అవసరాలకు కూడా వీటిని వినియోగించుకోవచ్చు. రుణం తీసుకునే సమయంలోనే దీనిపై బ్యాంక్‌లు నిబంధనల గురించి స్పష్టంగా తెలియజేస్తాయి" అని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్ శెట్టి వివరించారు. అయితే ఈ రుణాన్ని స్పెక్యులేటివ్ అవసరాలకు వినియోగించరాదని సూచించారు. ఇదే విషయం రుణ ఒప్పంద నిబంధనల్లోనూ స్పష్టంగా ఉంటుంది.

**రుణం రాకపోతే..?**

చాలా సంస్థలు బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ సమయంలో (గృహ రుణం బదిలీ) టాపప్ రుణాలు ఆఫర్ చేస్తున్నట్టు పైసాబజార్ చౌదరి తెలిపారు. ఇంటి రుణం ఇచ్చిన సంస్థ దగ్గర టాపప్ హోమ్ లోన్ పొందలేకపోతే.. లేదా అధిక వడ్డీ రేటు వసూలు చేస్తున్నట్టు అయితే.. అప్పుడు మిగిలి ఉన్న గృహ రుణాన్ని (బ్యాలెన్స్) మరో సంస్థకు బదిలీ చేసుకోవడం ద్వారా టాపప్ హోమ్‌లోన్‌ను పొందొచ్చని చౌదరి సూచించారు.

### ఇవి గమనించాలి

- → విహార యాత్ర, ఖరీదైన వస్తు కొనుగోళ్ల కోసం టాపప్ హోమ్‌లోన్ తీసుకోవడం ఎంత మాత్రం సూచనీయం కాదు. తమ ఆస్తి విలువ పెంచుకునేందుకు వినియోగించుకోవచ్చు.
- → టాపప్ హోమ్ లోన్‌ను వీలైనంత తక్కువ కాల వ్యవధికి (రెండు నుంచి నాలుగేళ్లు) పరిమితం చేసుకోవాలి. దీర్ఘకాలం ఎంపిక చేసుకోవడం వల్ల వడ్డీ భారం పెరిగిపోతుంది.
- → గృహ రుణం, దానిపై టాపప్‌తో కలిపి అసలు ఇంటి విలువలో 75 శాతం మించకుండా చూసుకోవడం సౌకర్యం.
- → ఈ తరహా రుణాలపై ప్రాసెసింగ్ చార్జీలను చాలా సంస్థలు వసూలు చేస్తున్నాయి.
- → బ్యాంక్‌తో సంప్రదింపులు చేయడం ద్వారా వీలైతే వడ్డీ రేటులో రాయితీ పొందొచ్చు.
- → టాపప్ హోమ్‌లోన్‌ను ఖరీదైన ఇతర రుణాల చెల్లింపులకు వినియోగించుకోవడం తెలివైన నిర్ణయమే అవుతుంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com